
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
శుక్రవారం, 24 మే 2024






ఇల్లెందులో కాంగ్రెస్ నేతల ప్రచారం


కోర్టులో బీఆర్ఎస్ నేతల ప్రచారం


బీజేపీ నేతల ప్రచారం

మండుటెండల్లో ఓట్ల వేట

- వ్యూహ, ప్రతివ్యూహాల్లో పార్టీల నాయకులు
- విద్యావంతుల కోసం పల్లెబాట
- మీటింగ్‌లకు వచ్చేవారికి దారి ఖర్చులు, భోజన వసతి సౌకర్యం

పట్టభద్రుల ప్రసన్నానికి నేతల పాట్లు

ఇల్లెందు, మే 23: పట్టభద్రుల ఓట్ల కోసం ప్రధాన పార్టీల నాయకులు పడరాని పాట్లు పడుతున్నారు. సాధారణ ఎన్నికల మాదిరిగా మైకులతో ప్రచారం చేయడానికి అవకాశంలేని శాసనమండలి పట్టభద్రుల ఎన్నికల్లో అర్హులైన గ్రాడ్యుయేట్ల కోసం నేతలు జల్లెడపడుతున్నారు. ఓటర్ల జాబితాల్లో పేర్లు ఉన్న పట్టభద్రులు సుదూర గ్రామాల్లో, తండాల్లో, గూడేల్లో ఇద్దరు, ముగ్గురు ఉండడంతో వివిధ పార్టీల నాయకులు మండుటెండల్లో సైతం కిలోమీటర్ల దూరంలో వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇల్లెందు నియోజకవర్గంలోని గార్ల, బయ్యారం, కామేపల్లి, టేకులపల్లి, ఇల్లెందు మండలం, పట్టణంలోని గ్రాడ్యుయేట్ ఓట్ల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు వారి నివాస గృహాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, కోర్టులకు, సింగరేణి కార్యాలయాలకు వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఇప్పటికే ఇల్లెందులో ప్రధాన పార్టీల అభ్యర్థులు తీన్మార్ మల్లన్న, ఏనుగుల రాకేష్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పట్టభద్రులతో ఆత్మీయ సమావేశాలు, మీటింగ్‌లు పెట్టి మొదటి ప్రాధాన్యత ఓటువేయాలని అభ్యర్థించారు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గంలో మూడు పర్యాయాలు విజయం సాధించిన బీఆర్ఎస్ తన సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు రాకేష్‌రెడ్డి తరుపున బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ప్రచారంలోకి దింపింది. పోల్ మెనేజ్‌మెంట్ కోసం ఓటర్లుగా నమోదైన గ్రాడ్యుయేట్ ఇళ్లకు వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. కాగా విద్యాసంస్థలకు వేసవి సెలవులు ఉండడంతో లెక్చరర్లు స్వగ్రామాలకు వెళ్లడంతో వారి చిరునామాలు సేకరించి ఫోన్ ద్వారా ఓటు వేసేందుకు రావాలని ప్రయాణ ఖర్చులు ఇస్తామని పలు పార్టీల నాయకులు కార్యకర్తలు ఆఫర్ చేస్తున్నారు.

మీటింగ్‌కు వస్తే రూ.300

శాసనమండలి పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా గ్రాడ్యుయేట్లతో ఏర్పాటు చేస్తున్న సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలకు వారిని రప్పించేందుకు ప్రధాన పార్టీల నాయకులు ప్రయాణాల ఖర్చులు, ఇతర విందులకు నగదు పంపిణీ చేస్తుండడం గమనార్హం. ఇల్లెందులో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించిన రెండు ప్రధాన పార్టీలు సమావేశాలకు వచ్చిన పట్టభద్రులకు రూ.300చొప్పున చెల్లించడం గమనార్హం. అంతేగాక మండలాల నుంచి వచ్చే గ్రాడ్యుయేట్లకు వాహనాలు కూడా ఏర్పాటు చేసి అటు పట్టభద్రులు, ఇటు పార్టీ శ్రేణులతో ఎన్నికల ప్రచార సమ్మేళనాలు నిర్వహించారు. అయితే ఆత్మీయ సమ్మేళనాల్లో పార్టీల నాయకులు ఎక్కువగా, పట్టభద్రులు తక్కువగా ఉంటున్నా వివిధ పార్టీల స్థానిక నేతలు అందరినీ పట్టభద్రులుగా పేర్కొంటూ అందినంత పోగేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ప్రచారం 25న ముగియనుండడంతో గురువారం ప్రధాన పార్టీల నేతలు, కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించారు.


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

- ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోట : మంత్రి తుమ్మల
- ఖమ్మంలో మేయర్, కార్పొరేటర్లతో సమావేశం

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 23: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనిచేయాలని, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మరోసారి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కంచుకోట అని ఈ ఎన్నికల ఫలితాల్లో నిరూపించాలని తెలిపారు. ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో ఎమ్మెల్సీ ఎన్నికల తీరుపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్షించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలోనే ఎక్కువ మంది పట్టభద్రుల ఓటింగ్ ఉందని, ఉమ్మడి జిల్లాకు చెందిన ఓటర్లు ఖమ్మంలోనే అధికంగా ఉంటారని మంత్రి తుమ్మల తెలిపారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాలను తీసుకొని ఎక్కువశాతం పోలింగ్ జరిగేలా కార్యాచరణ చేయాలని సూచించారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు చావా నారాయణరావు, పొట్ల వీరేందర్, ఆళ్ల అంజిరెడ్డి, సాధు రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీప్రాంతాల్లో ఒకప్పుడు ప్రధాన ఉపాధి వనరుగా ఉన్న తునికాకు నేడు అక్కరకు రాకుండా పోతోంది. మారిన పరిస్థితుల కనుగుణంగా తునికాకు సేకరణ వల్ల ఫలితం లభించకపోవడంతో గిరిజనులు ఆకు సేకరణకు ఆసక్తి చూపడం లేదు. ఒకప్పుడు తునికాకు సేకరణఅంటే అటవీ గ్రామాల్లో పండుగ వాతావరణం ఉండేది. ఆకు సేకరణ ఎప్పుడు ప్రారంభమవుతుందా.. అని గిరిజనులు ఎదురు చూసేవారు. ఆకు కోయాలంటూ కలేదార్లు గ్రామాల్లో టమకా వేయించకముందే గిరిజనులు అడవుల్లోకి వెళ్ల ఆకు సేకరణ చేసేవారు. ప్రతీ ఏడాది వేసవిలో ఆడా, మగా, పెద్దా, చిన్నా తేడా లేకుండా ఆకు సేకరించి డబ్బు సంపాదించేవారు. చాలా మందికి తునికాకు సేకరణ ఉపాధి మార్గంగా ఉండేది. కానీ నేడు పరిస్థితులు మారాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో ఆకు సేకరణ అంటేనే గిరిజనులు ముందకు రావడం లేదు. అటవీశాఖ ఈ ఏడాది 32 వేల స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యాన్ని పెట్టుకున్నా, ఆ లక్ష్యాన్ని చేరుకునే పరిస్థితి కనిపించడం లేదు. తునికాకు నగదును గిరిజనుల అకౌంట్లలో జమ చేస్తుండడమే వారు ఆకు సేకరణకు దూరమవ్వడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అలాగే అడవుల్లో నాణ్యమైన ఆకు లభించకపోవడం మరో కారణంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని అనేక మండలాల్లోని తునికాకు కల్లాలు మూతపడ్డాయి.



అక్కరకురాని ఆకు

- భద్రాద్రి జిల్లాలో తునికాకు సేకరణపై తగ్గిన ఆసక్తి
- ఆకు కోసేందుకు ముందుకు రాని గిరిజనులు
- మేలైన ఆకు కొరత, ఉపాధి పనులే కారణం
- నగదు అకౌంట్‌లో వేస్తుండటమే ప్రధాన సమస్య
- ఏజెన్సీలో మూతపడ్డ కల్లాలు

చర్ల, మే 23: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈఏడాది 31యూనిట్ల ద్వారా 32వేల స్టాండర్డ్ బ్యాగుల తునికాకుని సేకరించుకోవాలని అటవీ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. పాల్వంచ, కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, కిన్నెలసాని డివిజన్‌ల్లో ఆకు సేకరణ ప్రారంభమైంది. జిల్లాలో ఆకు సేకరణ ప్రారంభించినా గిరిజనులు ఆకు కోసేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 31యూనిట్లలో అన్ని కలాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

నగదు ఎకౌంట్లలో వేయడమే కారణం

ఏజెన్సీలోని గిరిజనులు, వలస ఆదివాసీలు తునికాకు సేకరణపై ఆశక్తి చూపకపోవడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. అందులో ప్రధానంగా ఆకులు కోసిన తరువాత అధికారులు నగదును గిరిజనుల అకౌంట్లలో వేస్తుండం ఇందుకు కారణం. చాలా మంది నగదు తమ అకౌంట్లలో పడటం లేదని చెబుతున్నారు. దీనిపై అధికారులను అడిగితే స్పందన ఉండటం లేదని వాపోతున్నారు. అలాగే ఆకులు కోసే వారిలో చాలామంది నిరక్ష్యరాసులు, వయస్సు పైబడిన వారు, వలస వచ్చిన వారు ఉంటున్నారు. దీంతో చాలా మందికి బ్యాంక్ అకౌంట్లు ఉండటం లేదు. ఇతరుల అకౌంట్లలో నగదు పడ్డా వారికి చేరడం లేదని తెలుస్తోంది. దాంతో కష్టం చేసినా నగదు రాకపోతే ఎలా అని గిరిజనులు వాపోతున్నారు. గతంలో ఆకులు కోసిన వారానికి కలేదార్లు నగదు అందజేసే వారని, అదే విధానం ఉంటే బాగుందని గిరిజనులు అధికారుల ముందు మొరపెట్టుకుంటున్నారు. అలాగే తెలంగాణలో 50 ఇకుల కట్టుకు ధర రూ.3 చెల్లిస్తుండగా, ఛత్తీస్‌గఢ్‌లో అక్కడి ప్రభుత్వం రూ.5.75 చెల్లిస్తోంది. దీంతో కొంతమంది అక్కడికి వెళ్లి ఆకు సేకరణ చేస్తున్నారు.

కనిపించని మేలైన తునికాకు..

గతంలో తునికాకు గ్రామాలకు దగ్గల్లో కనిపించేది. స్థానికులు ఉదయాన్నే ఆకు సేకరించే వారు. కానీ కాలక్రమంలో తునికాకు చెట్లు కనుమరుగవుతున్నాయి. పోడు సాగుతో చాలామంది రైతులు చెట్లు, మోడులను తొలగిస్తున్నారు. నేడు ఆకులు కోయాలంటే సుమారు 5నుంచి 7 కిలోమీటర్లు నడవాల్సి ఉంటోంది. అంతదూరం వెళ్లినా మేలైన ఆకు అభించడం లేదని గిరిజనులు చెబుతున్నారు. అలాగే గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. గిరిజనులు ప్రతీ రోజు ఆ పనులకే వెళుతున్నారు. నగదు కూడా వారంలో అందుతోంది. దీంతో అనేక మంది ఉపాధి పనులకే వెళ్తున్నారు.

చర్లలో 32 కల్లాలకు ఐదే ప్రారంభం

జిల్లాల్లోనే నాణ్యమైన తునికాకు లభించే ప్రాంతాల్లో చర్ల ముందుంటుంది. ఇక్కడ అడవులు గ్రామాలకు దగ్గరగా ఉంటాయి. ఎక్కడ చూసినా తునికాకు కనిపిస్తుంది. కాగా ఈ ఏడాది మండలంలో ఒక యూనిట్‌లో 32 కల్లాల ద్వారా 2,800 స్టాండర్డ్ బ్యాగుల ఆకుని సేకరించాలని అటవీశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ఇప్పటివరకు కేవలం 5కల్లాల్లోని గిరిజనులు మాత్రమే ఆకులు కోస్తున్నారు. అటవీగ్రామాల్లోని చెన్నాపురం, ఎర్రంపాడు, తిప్పాపురం, పెద్దమిడిసిలేరు, ఉంజుపల్లి, వద్దిపేట, బత్తినిపల్లి ఇతర గ్రామాల గిరిజనులు ఆకు కోసేందుకు ముందుకు రావడంలేదు. అటవీశాఖ అధికారులు గిరిజనులతో మాట్లాడినా ఆకులు కోసేది లేదంటున్నారు. దీంతో ఈ ఏడాది చర్ల అటవీశాఖ పెట్టుకున్న లక్ష్యం ఏమాత్రం చేరుకునే పరిస్థితి కనిపించడం లేదు.

లక్ష్యానికి చేరువలోకి వస్తాం : అటవీశాఖ జిల్లా అధికారి కృష్ణగౌడ్

జిల్లాలో ఈఏడాది 32వేల స్టాండర్డ్ బ్యాగుల ఆకు సేకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. చాలా మండలాల్లో ఆకు సేకరణ మందగొండిగా సాగుతోంది. కొన్ని మండలాల్లోని గిరిజనులు ఆకులు కోసేందుకు ముందుకు రావడం లేదు. ఆకులు కోసే ప్రతీ వ్యక్తికి అకౌంట్లలో నగదు వేస్తున్నాం.. నగదు పడటం లేదనేది అవాస్తవం. ఈ ఏడాది అనుకున్న టార్గెట్ చేరుకునేందుకు ప్రయత్నిస్తాం. లేదంటే కనీసం 80నుంచి 90 శాతం లక్ష్యానికైనా చేరువలోకి వస్తాం.

ప్రజల పక్షాన పోరాడేది బీజేపీనే...

- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఒకే పక్షం
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలి
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

7


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

నాలుగు నెలలకే కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తం

- పాలనపై మంత్రులకు సరైన అవగాహన లేదు
- అవినీతి, అక్రమార్కులను చట్టసభలకు పంపొద్దు
- మాజీఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు రఘునందన్‌రావు

7



జిల్లాలో నేడు మాజీమంత్రి హరీష్‌రావు 7

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

మళ్లీ దొరికాడు

- ఏసీబీకి చిక్కిన చర్ల డిప్యూటీ తహసీల్దార్
- పట్టా మార్పిడి కోసం రూ.50 వేల లంచం డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన బాధిత వ్యక్తి
- రూ.20వేలు తీసుకుంటుండగా పట్టివేత
- గతంలోనూ లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సదరు అధికారి


లంచం తీసుకుంటూ పట్టుబడ్డ చర్ల డిప్యూటీ తహసీల్దార్ భరణిబాబు

చర్ల, మే 23: భూమి పట్టా మార్పిడి కోసం ఓ వ్యక్తి దగ్గర రూ.20వేలు లంచతీసుకుంటూ భద్రాద్రి జిల్లా చర్ల డిప్యూటీ తహసీల్దార్ బీరవెల్లి భరణిబాబు గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ ఇన్‌చార్జ్ డీఎస్పీ వై.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం. భద్రాద్రి జిల్లా చర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కర్ల రాంబాబు, అతడి భార్య పర్శిక రాజమ్మ కలిసి గిరిజనేతరుల దగ్గర మూడెకరాల రెండు గుంటల భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమిని కే-ఫామ్ కింద పట్టా చేయించుకోవడం కోసం డిప్యూటీ తహసీల్దార్ భరణిబాబుని కర్ల రాంబాబు సంప్రదించాడు. కే-ఫామ్, ఎల్-ఫామ్ ప్రాసెస్ పూర్తయితే పట్టా మార్పిడి జరుగుతుందని రూ.50వేలు ఇవ్వాలని డీటీ భరణిబాబు డిమాండ్ చేశాడు. దాంతో రాంబాబు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు రూ.20వేలు నగదును చర్ల తహసీల్దార్ కార్యాలయంలో డీటీ భరణిబాబు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని డీఎస్పీ తెలిపారు. నెలరోజుల వ్యవధిలో ఉమ్మడి జిల్లాలో లంచాలు తీసుకుంటుండగా నలుగురిని పట్టుకున్నామని డీఎస్పీ రమేష్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే ఏసీబీకి సమాచారమివ్వాలని సూచించారు.

2017లో ఇసుక కూపన్ల కోసం లంచం

డిప్యూటీ తహసీల్దార్ భరణిబాబు 2017లోనూ ఏసీబీకి చిక్కాడు. భద్రాద్రి జిల్లా బూర్గంపాడులో జరుగుతున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత ఏర్పడింది. దీంతో సదరు కాంట్రాక్టర్ శివకుమార్ అక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ భరణిబాబుని అనుమతి పత్రం ఇవ్వాలని కోరాడు. అయితే కాంట్రాక్టర్ నగదు ఇవ్వకపోవడంతో అనుమతి పత్రం జారీ చేయలేదు. అయినా కాంట్రాక్టర్ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక తోలుతుండగా భరణిబాబు దురుసుగా ప్రవర్తించి రూ.25వేలు డిమాండ్ చేశాడు. దాంతో ఆ కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. అనంతనం బదిలీపై భరణిబాబు చర్ల డిప్యూటీ తహసీల్దార్‌గా జాయిన్ అయ్యాడు. మళ్లీ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.

ఏన్కూరు వద్ద వైరా లింక్ కెనాల్ పనులపై సూచనలిస్తున్న మంత్రి తుమ్మల



వడివడిగా సీతారామ లింక్ కెనాల్ నిర్మాణం

- ఆగస్టు నాటికి పనులు పూర్తిచేయాలని లక్ష్యం
- సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభించేందుకు సన్నాహాలు
- నిరంతరం పర్యవేక్షిస్తున్న మంత్రి తుమ్మల
- ఏన్కూరు వద్ద కాలువ పనుల పరిశీలన

ఖమ్మం/ఏన్కూరు, మే 23 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): వచ్చే ఆగస్టు నాటికి సీతారామ ప్రాజెక్టు ద్వారా వైరా, లంకసాగర్ ప్రాజెక్టులకు గోదావరి జలాలు అందించే లక్ష్యంతో సీతారామ వైరా లింక్ కెనాల్ పనులు చకచకా సాగుతున్నాయి. సుమారు రూ.100కోట్ల ఖర్చుతో 8.66.కి.మీ.పొడవు, 6మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న ఈ లింక్ కెనాల్ పనులకు మార్చి 13న శంకుస్థాపన చేశారు. రూ.15వేల కోట్లతో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన సీతారామ ప్రాజెక్టు కాలువలు కొన్నిచోట్ల పూర్తికాగా మరికొన్నిచోట్ల అసంపూర్తిగా ఉండడం, కొన్ని ప్యాకేజీల పనులు పూర్తికాకపోవడంతో భారీగా నిధుల ఖర్చుచేసినా ఒక్క ఎకరానికి నీరు అందడం లేదన్న విమర్శలు వచ్చాయి. గడిచిన ఐదేళ్లగా సీతారామ పనులపై పర్యవేక్షణ లేకపోవడంతో పూర్తిగా

(మిగతా 7వ పేజీలో...)


పరీక్షా కేంద్రంలో సిట్టింగ్‌ను పరిశీలిస్తున్న కో-ఆర్డినేటర్

నేడు పాలీసెట్ ఎంట్రన్స్

- ఖమ్మం జిల్లాలో ఐదు..
- భద్రాద్రిలో 10 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- ఒక్క నిమిషం ఆలస్యమైన నో ఎంట్రీ

7

అనుమానాస్పద స్థితిలో నర్సింగ్ విద్యార్థిని మృతి

- భద్రాచలంలోని కళాశాల వసతిగృహంలో తీవ్రరక్తస్రావంతో అపస్మారక స్థితికి...
- భద్రాద్రి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

7

లేని పోస్టుకు ఐదేళ్లుగా వేతనం

- ఏజీ ఆడిట్‌తో భద్రాద్రి దేవస్థానంలో ఆలస్యంగా వెలుగులోకి ...
- కమిషనర్‌కు నివేదిక పంపిన ఈవో

6

ఉత్తమ సేవలకు 108 టెక్నీషియన్‌కు రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న టెక్నీషియన్ వెంకట్

నేలకొండపల్లి, మే 23: 108 అంబులెన్సులో రోగులకు అత్యుత్తమ సేవలందించినందులకు గాను ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ అడపాల వెంకట్‌కు రాష్ట్రస్థాయి అవార్డు ప్రకటించారు. అవార్డును వెంకట్ హైదరాబాద్‌లో అందుకున్నారు. కార్యక్రమంలో 108 రాష్ట్ర జీవీకే గ్రీన్‌హెల్త్ సర్వీసెస్ సీఈఓ ఖలీద్, జిల్లా ప్రోగ్రాం అధికారి భూమా నాగేందర్, ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రణయ్‌కుమార్ పాల్గొనటంతో పాటుగా అవార్డు పొందిన వెంకట్‌ను అభినందించారు.

డీఎంఎఫ్‌టీ పనులపై కలెక్టర్ సమీక్ష

కొత్తగూడెం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జిల్లాలో డీఎంఎఫ్టీ (డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్) ద్వారా చేపడుతున్న పనులపు పురుగోతిపై సంబంధిత అధికారులతో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడతూ జిల్లాలో డీఎంఎఫ్‌టీ ద్వారా పనులు చేపడుతున్న ఏజెన్సీలో సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. శనివా రం సాయంత్రం లోగా జిల్లాలలో డీఎంఎఫ్‌టీ ద్వారా చేప డుతున్న పనుల పురోగతి మొదలు పెట్టని పనులు, పురోగతి లో ఉన్న పనులు పూర్తి అయిన పనులకు సం బంధిత పూర్తి వివరాలు నివేదికలు అందజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమవే శంలో డీఆర్‌డీవో విద్యాచందన, పంచాయతీ రాజ్ ఈఈ, ఆర్‌అండ్‌బీ ఈఈ, మిషన్ భగీరథ ఈఈ మున్సిపల్ కమిషనర్లు, డీఈలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

‘లీక్’ ఇచ్చిందెవరో ?

- సత్తుపల్లి మట్టి అక్రమతవ్వకాలపై ప్రభుత్వానికి నివేదిక
- బహిర్గతమైన నిఘా వర్గాల నివేదిక
- సోషల్ మీడియాలో వైరల్‌అవుతున్న ప్రతులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అధికార పార్టీ నేతలు

సత్తుపల్లి, మే 23: సత్తుపల్లి మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు, వ్యాపారానికి సంబంధించి నిఘా వర్గాలు కొద్ది రోజుల క్రితం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాయి. దీనిపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకునేందుకు సదరు నివేదికను ఖమ్మంలోని అధికారులకు పంపారు. కాని ఈ నివేదికలోని రెండు పేజీలు ఏకంగా సత్తుపల్లిలోని కొందరు మట్టి వ్యాపారులకు చేరింది. వెంటనే సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మట్టి వ్యాపారులకు, అక్రమాలకు అడ్డుకట్టవేయాల్సిన అధికారులకు మధ్య ఉన్న సత్సంబంధాలను బహిర్గతం చేస్తోంది. ప్రభుత్వానికి చేరిన నివేదిక, దానిలోని వివరాలు, వైరల్‌గా మారటం విమర్శలు, వివాదానికి దారితీస్తోంది.

అసలు ఏమి జరిగిందంటే..

సత్తుపల్లి మండలంలో కొందరు మట్టి వ్యాపారులు అనుమతులు లేకుండా మట్టి అక్రమ తవ్వకాలను సాగిస్తూ రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. రెండు మూడేళ్లుగా అక్రమంగా అనుమతులు లేకుండా జరుగుతున్న మట్టి తవ్వకాలపై 'ఆంధ్రజ్యోతి' ఎప్పటికప్పుడు కథనాలు ప్రచురించింది. అధికారులు మాత్రం నామమాత్రపు దాడులతో సరిపెట్టారు. ఇటీవల కాలంలో మట్టి వ్యాపారుల మధ్య ఆధిపత్య పోరు కారణంగా మట్టి వ్యాపారం రోడ్డున పడి పోలీసులకు ఫిర్యాదు చేసుకునే వరకూ వెళ్లింది. ఈ క్రమంలో అధికారులు జోక్యం చేసుకొని దాడులు కూడా చేశారు.

మట్టి అక్రమాలపై నిఘావర్గాల నివేదిక

మండలంలో కొనసాగుతున్న మట్టి అక్రమ తవ్వకాలపై నిఘా వర్గాలు ప్రభుత్వానికి నివేదిక పంపాయి. 20, 30 అడుగుల లోతులో గోతులు తవ్వుతూ గ్రావెల్‌ను అక్రమంగా తవ్వి, రవాణా చేసి టిప్పర్ గ్రావెల్ రూ.3500-రూ.4500 లకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ట్రాక్టర్ గ్రావెల్ రూ.950కి విక్రయిస్తున్నారని వివరించారు. సరైన డాక్యుమెంట్లు లేకుండా లైసెన్స్ లేని అనుభవం లేని డ్రైవర్ల కారణంగా తరచూ ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయని నివేదికలో పేర్కొన్నారు. దీనికి తోడు ప్రభుత్వానికి కూడా నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. చర్యలు తీసుకోవాలని సూచించారు. పనిలో పనిగా అధికార పార్టీ నాయకులకు మట్టి మట్టి వ్యాపారులు అనుచరులుగా ఉన్నారని, కొందరు విలేకర్లు రెండు గ్రూపులుగా విడిపోయారని, ఒక గ్రూపు ఎమ్మెల్యే రాగమయి వర్గంగానూ, మరో గ్రూపు మాజీ ఎమ్మెల్యే సండ్ర వర్గంగా ఉన్నారని నివేదికలో పొందుపరిచారు. వెంకటవీరయ్య వర్గంగా ఉన్న వారు మాత్రమే మట్టి అక్రమ తవ్వకాలపై కథనాలు ప్రచురిస్తున్నారని పేర్కొన్నారు.

నివేదిక బహిర్గతం-సోషల్ మీడియాలో వైరల్

నిఘా వర్గాలు ప్రభుత్వానికి ఇచ్చినట్లుగా చెపుతున్న నివేదికలోని రెండు పేజీలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రభుత్వానికి రహస్యంగా చేరిన నివేదికను ప్రభుత్వం సంబంధిత అధికారులకు పంపినట్లు, అది ఖమ్మంలోని ఒక కార్యాలయం నుంచి సత్తుపల్లి మట్టి వ్యాపారుల చేతికి చేరినట్లు చెపుతున్నారు. అక్కడి నుంచి సత్తుపల్లి ప్రాంతంలోని అధికార, విపక్ష పార్టీల్లోని నాయకులకు చేరింది. మట్టి వ్యాపారులపై దాడుల సందర్భంగా కొందరు వ్యాపారులు అధికారులను కలిసేందుకు వెళ్లిన సందర్భంలో తమపై వత్తిడి ఉందని అంటూ సదరు నివేదికను చూపినట్లు ప్రచారం జరుగుతోంది. ఇది చివరకూ వారికి చేరి వైరల్‌గా మారింది.

ఆగ్రహంగా అధికార పార్టీ నాయకులు

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పేజీలలోని అంశాలకు సంబంధించి అధికార పార్టీలోని కొందరు నాయకులు



మట్టి తవ్వకాలు జరుపుతున్న దృశ్యం (ఫైల్)

తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మట్టి అక్రమ వ్యాపారంతో తమకు సంబంధం లేకున్నా తమ పేర్లు నివేదికలో రాసి తమను అప్రతిష్టపాలు చేస్తున్నారని ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. కొందరు అధికారులు తమను ఉద్దేశ్యపూర్వకంగా టార్గెట్ చేస్తూ, తమ ప్రతిష్టను మసకబార్చే ప్రయత్నం చేస్తున్నారని బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. గత ప్రభుత్వంలో కూడా మట్టి అక్రమ తవ్వకాలు, అమ్మకాలు విచ్చలవిడిగా సాగాయని, అయినా అప్పట్లో ఈ రకమైన నివేదికలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వానికి అందిన నివేదికను లీక్ చేయటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నివేదికను బహిర్గతం చేయటం మట్టి వ్యాపారులకు అందజేయటం చూస్తే వ్యాపారులకు, అధికారులకు ఎంతటి సత్సంబాధాలున్నాయో స్పష్టం అవుతోందని పలువురు విమర్శిస్తున్నారు. వైరల్ అవుతున్న మూడు, నాలుగు పేజీల్లో ఎక్కడా సంబంధిత అధికారుల పాత్రపై రిపోర్టు చేయకపోటంపై కూడా విమర్శలున్నాయి. దీనికి తోడు అక్రమ వ్యాపారాన్ని వెలుగులోకి తెస్తూ కథనాలు రాసిన విలేకర్లు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వర్గమని నివేదికలో రాయటం తీవ్ర విమర్శలకు దారితీసింది. వాస్తవాలు వెలుగులోకి తెస్తే ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకమని బావన కల్పించే విధంగా రిపోర్టు ఉండటం ఉద్దేశ్యపూర్వకమేనని రాజకీయ నాయకులు ఆరోపిస్తున్నారు. మొత్తంగా నివేదిక, అది ప్రభుత్వం నుంచి అధికారులకు చేరటం అది బహిర్గతం కావటం పలు వివాదాలు, విమర్శలకు దారితీసింది.

నేటినుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఖమ్మం ఖానాపురంహవేలి మే 23: ఇంటర్ సప్లిమెంటరి పరీక్షలు శుక్రవారం నుంచి జూన్ 3 వరకు జరగనున్నాయి. జిల్లాలో 42 పరీక్షా కేంద్రాలలో మొదటి సంవత్సరం 10,352 మంది విద్యార్థులు , ద్వితీయ సంవత్సరం 4632 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు. పరీక్షా పేపర్లు సీసీ కెమెరాల ముందే ఓపెన్ చేయాలనీ, పరీక్షా కేంద్రంలోనికి ఎటువంటి మొబైల్ ఫోన్స్ కానీ ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ కానీ అనుమతించరు. విద్యార్థులకు పరీక్షా కేంద్రాల వద్ద హాల్ టికెట్స్ ఏదైనా సమస్య ఉంటే వారికీ సహకరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఎస్‌పీసీ స్టోర్‌లో నిత్యావసరాలు



స్టోర్ ప్రారంభిస్తున్న కమాండెంట్ వెంకట్‌రాములు

సత్తుపల్లి, మే 23: మండలంలోని 15వ ప్రత్యేక బెటాలియన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్సిడైరీ పోలీస్ క్యాంటీన్ (ఎస్‌పీసీ) స్టోర్‌ను వర్చువల్ విధానంలో టీఎస్ఎస్‌పీ బెటాలియన్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ స్వాతీలక్రా గురువారం ప్రారంభించారు. స్టోర్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందని, బెటాలియన్ ఉద్యోగుల కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందుబా టులో ఉంటాయని, ఎంతో చవకగా సబ్సిడీపై నాణ్యమైన సరుకులు లభిస్తాయన్నారు. బెటాలియన్ ఉద్యోగుల సంక్షే మం కోసం పనిచేస్తున్న ఉన్నత ఉద్యోగులకు కమాడెంట్ పీ.వెంకట్‌రాములు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సహాయ దళాధిపతులు ఏ.తిరుపతి, ఎస్‌డీ.రంగారెడ్డి, ఏవో, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో నేల సారవంతం

- జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల
- జీలుగు విత్తనాల పంపిణీ ప్రారంభం



జీలుగు విత్తనాలు పంపిణీ చేస్తున్న డీఈవో విజయనిర్మల

కల్లూరు, మే 23: కల్లూరులో వ్యవసాయ శాఖ తరుపున జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) విజయనిర్మల సబ్సిడీపై అందజేస్తున్న జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. డీఏవో మాట్లాడుతూ పచ్చిరొట్ట సాగుతో నేల సారవంతం కావటమేకాకుండ జీవం పోస్తుందన్నారు. పచ్చిరొట్ట విత్తనం చల్లి కలియ దున్నాలని డీఏవో రైతులకు సూచించారు. ఇప్పటికే జిలుగులు, జనుము, పిల్లిపెసర విత్తనాలు పంపిణీ చేసేందుకు జిల్లా స్థాయిలో 21,276 క్వింటాళ్ల విత్తనాలకు గాను 10,323 క్వింటాళ్ల విత్తనాలు ప్రాథమిక సహకార సంఘాలకు చేరగా వాటిని పంపిణీకి శ్రీకారం చేట్టామన్నారు. ఇంకాను 11,600 క్వింటాళ్ల విత్తనాలు రానున్నాయని చెప్పారు. రైతులు పచ్చిరొట్ట విత్తనాల కోసం ఎలాంటి ఇబ్బంది పడవద్దని అవసరమైనంత వరకు అందిస్తామ న్నారు. భూమిలో తెమ శాతంను దృష్టిలో ఉంచుకొని విత్తన సాగు చేయాలని సూచించారు. అదే విధంగా విత్తన కొనుగోలులో అధికృత డీలర్ల వద్ద రశీదులు పొంది విత్తన కొనుగోలు చేయాలని, ఎలాంటి అనుమతి లేకుండా వచ్చే వారి దగ్గర నుంచి విత్తన కొనుగోలు చేసి రైతులు మోసపోవద్దని డీఏవో విజయనిర్మల కోరారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏడీఏ యు నరిసింహారావు, ఏఓ ఎం రూప, కల్లూరు సొసైటి సీఈఓ బీరవల్లి శ్రీనువాసరావు, రైతులు కర్నాటి రత్నాలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గురక, జబ్బవాపు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకటనారాయణ

కొణిజర్ల, మే 23: వర్షాకాలంలో తెల్లపశువులలో జబ్బవాపు, నల్లపశువులలో గురుకవాధి వస్తుందని పశుయాజమానులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకటనారాయణ సూచించారు. ఈ వాధులపై మండల పరిధిలోని పెద్దగోపతిలో ఉచిత టీకాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా అధికారి పాల్గొని పశువులకు టీకాలు వేసి ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 31వ తేదీ వరకు ఉచిత టీకాల కార్యక్రమాలు ఉంటాయని పశుయజమానులు అంతా పశువులకు టీకాలు వేపించి పశువులు వ్యాధి భారిన పడకుండ చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శ్రీనివాస్‌నాయక్, అరుణ, నాగేశ్వరరావు, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంను పరిశీలించిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి

ఖమ్మం రూరల్, మే 23: మండల పరిధిలోని పొన్నేకల్లులోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎంపీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూం ను కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి గురువారం పరిశీలించారు. సిబ్బంది ద్వారా వివరాలు అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యా, మౌలిక వసతుల కార్పొరేషన్ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఎలక్షన్ ఏజెంట్ తుళ్లూరి బ్రహ్మయ్య, నాయకులు నరేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న రఘురాంరెడ్డి

బీఆర్ఎస్ ప్రచార రథాలు ప్రారంభం



ప్రచారరథాలు ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మం కార్పొరేషన్, మే 23: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి పార్టీ ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభించారు. శాసనమండలికి నల్లగొండ -ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి జరుగుతున్న ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేష్‌రెడ్డి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ ప్రచారాన్ని మరింత ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా గురువారం ఉదయం ఖమ్మం తెలంగాణ భవన్ ప్రాంగణంలో పార్టీ ప్రచార రథాలను (ఆటోలు) ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, సీనియర్ నాయకులు గుండాల కృష్ణ, శీలంశెట్టి వీరభద్రం, పగడాల నాగరాజు తదితర ప్రముఖులు గులాబీ జెండాలు ఊపి ప్రారంభించారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డిని గెలిపిద్దాం అంటూ నినాదాలిచ్చారు

లేని పోస్టుకు ఐదేళ్లుగా వేతనం

- ఏజీ ఆడిట్‌తో భద్రాద్రి దేవస్థానంలో ఆలస్యంగా వెలుగులోకి
- కమిషనర్‌కు నివేదిక పంపిన ఈవో

భద్రాచలం, మే 23: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం క్యాడర్ స్ట్రెన్త్‌లో లేని పోస్టుకు గత ఐదేళ్లుగా వేతనం చెల్లిస్తున్న విషయం ఏజీ ఆడిట్‌తో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఐదేళ్ల క్రితం నుంచి సదరు ఉద్యోగికి వేతనం చెల్లిస్తున్నట్లు ఏజీ ఆడిట్‌లో తేలడంతో దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సత్వరమే చర్యలు చేపట్టాలని దేవస్థానం అధికారులకు ఆడిట్ అధికారులు సూచించారు. దీంతో ఈ విషయమై దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుకు భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి నివేదికను పంపారు. దేవస్థానంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా అవుట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న ఓ ఉద్యోగిని కన్సాలిడేటెడ్ పేతో సిస్టమ్స్ అడ్మినిస్ట్రేటర్‌గా మారుస్తూ అప్పటి దేవస్థానం ఈవో అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో సదరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి చెల్లించాల్సిన మొత్తం కన్నా అధిక మొత్తం(కన్సాలిడేటెడ్ పే దేవస్థానం ఖజానా నుంచి) చెల్లించారు. ఇటీవల ఏజీ ఆడిట్ అధికారులు భద్రాద్రి దేవస్థానంలో ఆడిట్‌ను నిర్వహించారు. ఈ సమయంలో క్యాడర్ స్ట్రెన్త్‌లో లేని పోస్టును సృష్టించి వేతనం చెల్లించిన విషయాన్ని గుర్తించారు. ఈ క్రమంలో ఎటువంటి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపకుండా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అభ్యర్థన మేరకు కన్సాలిడేటెడ్ పేగా చేయడం పట్ల ఆడిట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా ఈ మార్పు జరిగినట్లు గుర్తించిన వారు ఇందుకు తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని దేవస్థానం అధికారులకు సూచించారు. ఈ క్రమంలో సదరు ఉద్యోగి నుంచి అధికంగా చెల్లించిన మొత్తాన్ని రికవరీ చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆడిట్ అధికారుల సూచన మేరకు దేవాదాయ శాఖ కమిషనర్‌కు దేవస్థానం అధికారులు నివేదిక పంపారు. ఈ నివేదికపై పూర్తిస్థాయిలో కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చిన అనంతరం చర్యలు తీసుకోనున్నట్లు దేవస్థానం వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా సదరు ఉద్యోగి సీఆర్వో ఇన్‌చార్జ్‌గా ఉన్న సమయంలో వసతి నిర్వహణ సామగ్రి కొనుగోళ్లలో అవకతవకలకు కారణమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ సమయంలో అతడి నుంచి రూ.లక్షకు పైగా సొమ్మును దేవస్థానం అధికారులు రికవరీ చేశారు.

బీఆర్ఎస్, బీజేపీలకు ఓటు అడిగే హక్కు లేదు

- ఆ రెండు పార్టీలు నిరుద్యోగులను మోసం చేశాయి
- టీపీసీసీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్ కపిలవాయి దిలీప్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్

చుంచుపల్లి, మే 23: గతంలో పట్టభద్రుల ఓట్లతో గెలిచి నిరుద్యోగుల సమస్యలను గాలికి వదిలివేసిన బీఆర్ఎస్, బీజేపీలకు ఓటు అడిగే హక్కు లేదని టీపీసీసీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం విద్యానగర్‌కాలనీలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన అప్పటి టీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి నిరుద్యోగుల సమస్యలను పక్కకు పెట్టడంతోనే ఈ ఉప ఎన్నికలు వచ్చాయన్నారు. రాష్ట్రంలో పదేళ్లుగా నియంతృత్వ పాలన కొనసాగిందని మండిపడ్డారు. ఈ కుటుంబ పాలనతోనే రాష్ట్రం లూటీ అయిందని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకకు ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సీటును గెటాయించి తీన్మార్ మల్లన్నను పట్టభద్రుల ముందుకు తీసుకొచ్చిందని, ఆశీర్వదించి గెలిపించాలన్నారు. గతంలో రాష్ట్రంలో 28 లక్షల మంది నిరుద్యోగులు విసుగెత్తి కేసీఆర్, కేటీఆర్‌లను ఎదురించేలా కాంగ్రెస్‌కు మద్దతుగా నిలుస్తూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో క్రియాశీలకంగా పాల్గొన్నారని గుర్తు చేసి కొనియాడారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం పరిశ్రమలు నెలకొల్పి స్థానికులకు 90 శాతం ఉపాధి అవకాశాలు కల్పించలేకపోయిందని మండిపడ్డారు. ప్రతీ ఏడాది దేశంలో 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న బీజేపీ మాట కేవలం మాటలకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. ఇతర రాష్ట్రాల్లో స్థానికతకు కొనసాగుతున్న ఉపాధి అవకాశాలు తెలంగాణ రాష్ట్రంలో ఎందుకు కల్పించడం లేదని గుర్తుచేశారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని, కాంగ్రెస్ హయాంలోనే అన్ని ప్రజలు, ప్రాంతాలు అభివృద్ధికి నోచుకుంటాయన్నారు. అదేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డి 370 జీవో, 46 జీవోలను రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పరిశీలించి అమలు చేసేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం, టీజేఎస్‌లు బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ కో-కన్వీనర్ కత్తి వెంకటస్వామి, కో-ఆర్డినేటర్ నాగ సీతారాములు, భద్రాద్రి జిల్లా జడ్పీ ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, జిల్లా నాయకులు కోనేరు సత్యనారాయణ, సీపీఐ, సీపీఎం, టిజేఎస్, కాంగ్రెస్ నాయకులు అన్నవరపు కనకయ్య, ఎస్‌కె. సాబీర్‌పాషా, శివప్రసాద్, అమ్మ మహేష్, వై.శ్రీనివాస్‌రెడ్డి, అల్లాడి నరసింహారావు, ఆళ్ల మురళీ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

- వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఏన్కూరు, మే 23: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కోరారు. గురువారం భగవాన్‌నాయక్‌తండాలో తీన్మార్ మల్లన్న గెలుపుకోసం జరిగిన సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు ఇంటింటికి తిరిగి మల్లన్న గెలుపుకు విస్తృత ప్రచారం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో నే గిరిజనులకు మేలు జరిగిందన్నారు. ఎన్నికల హామీ మేరకు త్వరలోనే జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే పక్కా గృహాల నిర్మాణంచేపడతామని హామి ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యంలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గుత్తా వెంకటేశ్వరరావు, సొసైటీ ఛైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, ఏ బ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, నాయకులు మేడికొండూరు ప్రసాద్, బాలాజీ, వేల్పుల నరసింహారావు, నల్లమల శివకుమార్, ముక్తి వెంకటేశ్వర్లు, మేడా దర్మారావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, శోభన్‌నాయక్, బానోతు రామారావు పాల్గొన్నారు.

ఖమ్మం వైద్య కళాశాల రెండో ఏడాది

ప్రవేశాలకు అనుమతి

- ఎన్ఎంసీ వర్చువల్ సమీక్షలో అనుమతుల జారీ
- పక్షం రోజుల్లో లోపాలు సరిచేసుకోవాలని రూ.2లక్షల జరిమానా

ఖమ్మం కలెక్టరేట్, మే 23: అనాటమీ తరగతుల్లో కడావర్ బాడీలు (మృతదేహాలు) లేక పోవడం.. అధ్యాపకులు లేకపోవడం..! ఫార్మా కాలేజీలో అవసరమైనంత బోధకులు లేకపోవడం..! ఇవీ జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) పరిశీలనలో వెలుగు చూసిన లోపాలు. ఈ లోపాలకు గాను రూ.రెండు లక్షల అపరాధం రుసుమును విధిస్తున్నట్లు, పక్షం రోజుల్లో లోపాలను సరిచేసుకోవాలంటూ ఎన్ఎంసీ ఆదేశాలు జారీ చేసింది. ఖమ్మం మెడికల్ కళాశాలను శుక్రవారం జాతీయ మెడికల్ కౌన్సిల్ సభ్యులు కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందితో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కళాశాలలో 13 విభాగాల్లో 45 అంశాల్లో ఎన్ఎంసీ అధికారులు పరిశీలించారు. ఈ నేపథ్యంలో వైద్య విద్య అభ్యసించేందుకు కళాశాలకు అనుసందానంగా ఉన్న ఆస్పత్రి లోపాలను నివేధికల్లో ప్రస్తావించారు. రోజువారీగా రావాల్సిన రోగుల సంఖ్య , ఇన్‌పేషంట్లు వారికి అందిస్తున్న వైద్యుల సంఖ్య తదితర అంశాలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. మొత్తం 2వేలకు పైగా ప్రతిరోజు ఓపీ, 300 మందికి పైగా కనీసం ఇన్‌పేషంట్లు వస్తున్నట్లు తెలిపారు. బోధన ఆస్పత్రిలో 122 మంది వైద్యులు సేవలు అందిస్తున్నారు. కళాశాలలో విద్యార్థుల శాతం కూడా 95 వరకు ఉంది. చిన్నపిల్లలకు అందుతున్న వైద్యసేవలు, సౌకర్యాలు కూడా వారు సంతృప్తిని వ్యక్తం చేశారు.



వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌తో వర్చువల్‌గా మాట్లాడుతున్న ఎన్ఎంసీ సభ్యులు

ఫార్మా తరగతి గదులు తదితర అంశాలపై కూడా మంచి మార్కులు సాధించింది. సాధారణంగా 100 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు ఉన్న కళాశాలలో కనీసం 1000 మంది ఔట్ పేషంట్లు అవసరం. దీనికి తగినట్లుగా ఉండడంతో వైద్య విద్యార్థులకు శిక్షణకు ఇది సరిపోతుందన్నారు. టీ హబ్‌లోనూ రోగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయి. అయితే వీటిపై సమగ్ర నివేధికలు అందించాలని ఎన్ఎంసీ అధికారులు ఆదేశించారు. ఎంసీహెచ్‌లోనూ జననాలు, రేటు డెలివరీలు తదితర అంశాలపై కూడా సమగ్రంగా నివేధికలు అందించాలని సూచించారు. లెక్చర్ హాళ్లు, పరీక్ష కేంద్రాలు సైతం తగినంతగా ఉండడంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే అనాటమీ విభాగంలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు సరిపోను లేకపోవడం లోపంగా గుర్తించారు. విద్యార్థులకు ప్రాక్టికల్స్ కోసం 'కడావర్' బాడీలు (మృతదేహాలు) లేకపోవడం లోపంగా పరిగణించారు. వాస్తవానికి 10 మృతదేహాలు ఉండాల్సి ఉండగా ఇక్కడ 6 మాత్రమే ఉన్నాయి. అయితే ఉస్మానియా నుంచి మృతదేహాలు తెప్పించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. దీనిపై పక్షం రోజుల గడువిచ్చారు. దీంతో జాతీయ అధికారులు ఈ లోపాలపై రూ 2లక్షల అపరాధ రుసుమును విధించారు. ఎట్టకేలకు ఖమ్మం మెడికల్ కళాశాలకు రెండో ఏడాది తరగతులకు అనుమతులు జారీ చేస్తున్నట్లు ఎన్ఎంసీ అధికారులు తెలిపారు. ఈ సమీక్షలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ సరిత, డాక్టర్ సదానందం, జనరల్ ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్, అదనపు సూపరిన్‌టెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ అమర్‌సింగ్, డాక్టర్ రాంబాబు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

వైభవంగా యోగానంద లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

- రామాలయం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన అధికారులు



కల్యాణం నిర్వహిస్తున్న వైదిక సిబ్బంది

భద్రాచలం, మే 23: భద్రాచలంలోని శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం గురువారం వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామికి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా స్వామి వారి కల్యాణంకు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు భద్రాద్రి రామాలయం నుంచి మేళ తాళాలతో తీసుకొచ్చారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ సమయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, యోక్తదారణ, శుభ ముహూర్తం, మాంగల్యదారణ,తలంబ్రాలు, వేద ఆశీర్వచనం తదితర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మంగళవారం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ గావించగా బుధవారం ధ్వజారోహణం, ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. గురువారం ఉదయం అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కాగా శుక్రవారం రథోత్సవం, శనివారం సదస్యం, తెప్పోత్సవం, దొంగలదోపు, ఆదివారం పూర్ణాహుతి, ధ్వజావరోహణం, ద్వాదశ ప్రదిక్షణాలు, ద్వాదశ ఆరాధనాలు, శ్రీపుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. ఈ కార్యక్రమంలో దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, అర్చకులు సౌమిత్రి శ్రీనివాసాచార్యులు, అమరవాది వెంకట్రామన్, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

ఈఎండీ 'లెక్క' ఏదీ?

- పత్రాల్లో కనిపించని సెక్యూరిటీ డిపాజిట్ రూ.31లక్షలు..!
- జిల్లా జనరల్ ఆస్పత్రి క్యాంటీన్ కేటాయింపులో మాయ
- గడువు ముగియడంతో వెలుగులోకి

ఖమ్మం కలెక్టరేట్, మే 23: ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో క్యాంటీన్ కేటాయింపులో ఈఎండీ (ఎర్నెస్ట్ మనీ డిపాజిట్-కాంట్రాక్టరు నుంచి తీసుకునే సెక్యూరిటీ డిపాజిట్) మాయం అయినట్లు తెలుస్తోంది. గత ఏడాది క్రితం జిల్లా ఆస్పత్రిలో క్యాంటీన్ నిర్వహణకు కాంట్రాక్టరుకు ఒప్పందం చేసుకునే సమయంలో తీసుకున్న ఈ మొత్తానికి లెక్కలేకుండా పోయిందని తెలిసింది. కార్యాలయం పద్దులో ఉండాల్సిన ఈ సొమ్ము ఏలా వినియోగించారో.. దానికి లెక్కా పత్రాలు లేకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వాస్తవానికి ఈ సొమ్మును కాంట్రాక్టరుకు నిర్ధేశిత గడువు తర్వాత వాటిని తిరిగి ఇచ్చేయ్యాల్సి ఉంటుంది. కానీ ఆ సొమ్ముకు మాత్రం లెక్క లేకుండా పోయింది.

ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి నిత్యం 3వేల మందికి పైగా రోగులు, వారి బంధువులు వస్తుంటారు. ఇక్కడ ప్రధాన ద్వారాకి దగ్గరగా క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా క్యాంటీన్ నిర్వహించుకునేందుకు టెండర్లు నిర్వహిస్తారు. అయితే గత ఏడాది క్రితం వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉండగా, ఈ క్యాంటీన్‌కు టెండర్లు నిర్వహించారు. వెంకటేశ్వర క్యాంటీన్ అనే కాంట్రాక్టరు నెలకు రూ. 5లక్షల81,600లను అద్దె చెల్లించే విధంగా క్యాంటీన్‌ను దక్కించుకున్నాడు. దీనికి గాను రూ.31లక్షలను సెక్యూరిటీ డిపాజిట్ కింద చెల్లించారు. క్యాంటీన్ నిర్వహణకు ఈ ఏడాది జనవరి 2కే సమయం మీరిపోయింది. అప్పటి వరకు క్యాంటీన్ కాంట్రాక్టరు ప్రతి నెలా అద్దెను చెల్లిస్తూ వస్తున్నా, గత ఏడాది డిసెంబర్ నుంచి అద్దెను చెల్లించడం లేదని తెలుస్తోంది. డిసెంబర్ నుంచి మే వరకు ప్రస్తుతం 5నెలల అద్దె క్యాంటీన్ యజమానులు బకాయి పడ్డారు. మొత్తంగా రూ. 29లక్షల 8వేలు బకాయిలు చెల్లించాల్సి ఉంది. అధికారులు వెళ్లి అద్దె కోసం ఒత్తిడి తెస్తున్నా 5 నెలలుగా చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ లోగా ఎన్నికల కోడ్ రావడంతో మిన్నకున్నారు. క్యాంటీన్ నిర్వహణకు జనవరితోనే గడువు మీరడంతో ఖాళీ చేయాలంటూ ఆస్పత్రి అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. కానీ నిర్వాహకులు మాత్రం మా ఈఎండీ ఉంది కదా.. దీనిలో జమచేసుకోండి అంటూ చెబుతున్నట్లు సమాచారం.


జిల్లా జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న క్యాంటీన్

● రూ.31లక్షలకు లెక్కలేవీ...!

జిల్లా జనరల్ ఆస్పత్రి వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్నప్పుడు ఏడాది క్రితం క్యాంటీన్‌కు ఒప్పందం కుదిరింది. ఆసమయంలో కాంట్రాక్టరు నుంచి ఈఎండీ కింద రూ.31లక్షలను చెల్లించారు. అయితే వీటిని అలాగే ఉంచి కాంట్రాక్టు ముగిసిన తర్వాత తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుంది. కానీ గత ఏడాది నవంబర్‌లో వీవీపీ పరిధి నుంచి బోధన కళాశాల పరిధిలోకి ఆస్పత్రిని మార్చారు. అప్పటి నుంచి ఒక్క డిసెంబర్ నెలలో మాత్రమే క్యాంటీన్ నుంచి నెల అద్దెను చెల్లించారు. ఆ తర్వాత డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు అద్దెను చెల్లించక పోవడంతో అధికారులు క్యాంటీన్ యజమానిపై ఒత్తిడి తెస్తున్నారు. క్యాంటీన్ యజమాని ప్రతి నెలా అద్దె చెల్లించినట్లు చెబుతున్నా..ఆ సొమ్ముకు ప్రస్తుతం లెక్కలేకుండా పోయింది. ప్రతి నెలా చెల్లించిన అద్దె, ఈఎండీ మొత్తం సొమ్ము ఏమయ్యిందని దేనికి ఖర్చు చేసిందీ లెక్కలేకుండా పోయింది. దీంతో కొత్తగా బాధ్యతలు చేపట్టిన జనరల్ ఆస్పత్రి కార్యాలయం అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. అక్కౌంట్లో డబ్బులు లేకపోవడం, రికార్డుల్లో వివరాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సొమ్ముకు ఎవరు బాధ్యులని లెక్కతేల్చుతున్నారు. వాస్తవానికి క్యాంటీన్ నిర్వహణకు సమయం ముగిశాక కొత్త చెక్కుల ద్వారా కాంట్రాక్టరుకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ రూ.31లక్ష ల విషయంలో ఏలాంటి రికార్డులు అధికారులకు అప్పగించక పోవడంతో ఎవరు బాధ్యత తీసుకోవాలో అర్థంకాని పరిస్థితి ఉంది. క్యాంటీన్ నిర్వహణ గడువు మీరడంతో ఈ రూ.31లక్షల బాగోతం బయటపడిందని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ విషయం ఆస్పత్రి అధికారులు జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సమాచారం. కలెక్టర్ కూడా ఈఎండీ సొమ్మును రికవరీకి ఆదేశించినట్లు తెలిసింది.

ఈఎండీని రికవరీ చేస్తాం

ఎల్. కిరణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

క్యాంటీన్ నిర్వహణ కోసం టెండర్లు వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్నప్పుడు జరిగింది. బోధనా ఆస్పత్రికి నవంబర్‌లో అప్పగించారు. అప్పటి నుంచి కేవలం ఒకనెల అద్దె మాత్రమే చెల్లించారు. అయితే క్యాంటీన్ నిర్వాహకులు ఇచ్చిన ఈఎండీని వైద్య విధాన పరిషత్ నుంచి రికవరీ చేస్తాం. అప్పుడు చెల్లించిన అద్దెకు మాకు సంబంధం లేదు. కానీ క్యాంటీన్ నిర్వాహకుల నుంచి 5నెలల అద్దెను కూడా వసూలు చేస్తాం.

జిల్లాలో నేడు మాజీమంత్రి హరీష్‌రావు
ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఖమ్మం, మే 23(ఆంధ్రజ్యోతిప్రతినిధి): పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయం కోసం మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావుతో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, ఎంపీలు నామ నాగేశ్వరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు శుక్రవారం జిల్లాలో ప్రచారం నిర్వహించనున్నారు. ఇందుకోసం హరీష్‌రావు గురువారం రాత్రికే ఖమ్మంలోని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గృహానికి చేరుకున్నారు. ఆయనకు ఎమ్మెల్సీ తాతా మధుసూధన్‌తో కలిసి ఎంపీ రవిచంద్ర స్వాగతం పలికారు. హరీష్‌రావు వెంట పెద్ది సుదర్శన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు ఉప్పల వెంకటరమణ ఉన్నారు. శుక్రవారం ఉదయం 10-30గంటలకు సత్తుపల్లిలో ఆ నియోజకవర్గం సమావేశం, 2-30గంటలకు బోనకల్‌లో మధిర నియోజకవర్గం సమావేశం, సాయంత్రం 5-30గంటలకు బూరుగూడెంలో పాలేరు నియోజవర్గం సమావేశం జరగనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకోసం ముఖ్యనేతలు పాల్గొంటున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో విద్యుత్ సరఫరా పరిశీలన

ఖమ్మం సంక్షేమవిభాగం, రఘునాథపాలెం, మే 23: టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా విద్యుత్‌శాఖ ఇంజినీరింగ్ అధికారులు గురువారం ప్రభుత్వ ఆస్పత్రులల్లో విద్యుత్ సరఫరా పరిశీలించారు. ఎస్ఈ సురేందర్ ఖమ్మం జిల్లా ఆసుపత్రిని, డీఈ రామారావు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను, ఖమ్మం అర్బన్ ఏడీఈ సంజయ్‌కుమార్ మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని విద్యుత్ సరఫరాను పరిశీలించారు. విద్యుత్ సరఫరా మెరుగుపర్చడంపై మండల వైద్యాధికారి బాలకృష్ణతో సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా డీఈలు, ఏడీఈలు వారి పరిధిలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించడం జరిగిందని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

క్రైం సమాచారం

90క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత

అన్నపురెడ్డిపల్లి, మే 23: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని, ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రా ష్ట్రంలోని కాకినాడ జిల్లా, గొల్లప్రోలు మండ లం, చేబ్రోలు గ్రామానికి చెందిన కోటిపల్లి మణికంఠ మండలంలోని గుంపెన రేషన్ దుకాణంలోని రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, కాకినాడకు తరలిస్తుండగా సమాచారం మేరకు గురువారం తెల్లవారు జా మున గ్రామ శివారులో వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంలో సుమారు 90క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న రేషన్ బియ్యం విలువ రూ1.17లక్షలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. కొనుగోలు చేసిన బియ్యాన్ని కాకినాడకు చెందిన కొర్ల వెంకట్రావుకి సరఫరా చేసేందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. కాకినాడకు చెందిన కోటిపల్లికి మణికంఠ, ఉలవకాయల ముత్యాలరాజు, కొర్ల వెంకట్రావుతో పాటు, కట్టుగూడెం గ్రామానికి చెందిన దుకాణ నిర్వాహకులు మిడి యం తులశమ్మ, షేక్ అజీమ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి


రాము మృతదేహం

ముదిగొండ, మే 23: ప్రమాదవశాత్తూ బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ముదిగొండలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యామాల రాము(45) అనే వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ట్రాక్టర్ పనిలో భాగంగా ఓ పొలం వద్ద బావిలో మంచినీళ్లు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ బావిలో పడ్డాడు. బావిలో పడిన అతడు కేకలు వేయడంతో చుట్టూపక్కల వారు వచ్చేసరికి నీటమునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సహాయంతో బయటకు తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాబా వసారాపై నుంచి పడి వ్యక్తి ..


శ్రీనివాసరావు మృతదేహం

సత్తుపల్లిరూరల్, మే23: డాబాకు ఆనుకుని ఉన్న వసారాను సరిచేస్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం సత్తుపల్లి మండలం తుంబూరులో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ ఎల్. హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిన్నబోయిన శ్రీనివాసరావు (45) డాబాకు ఆనుకుని ఉన్న వసారాను సరిచేస్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు స్థానిక ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ కల్టివేటర్ తగిలి ఒకరు..


ప్రసాద్ (ఫైల్)

సత్తుపల్లిరూరల్, మే23: కల్టివేటర్ ట్రాక్టర్ తగిలి వ్యక్తి ఒకరు మృతి చెందిన సంఘటన మునిసిపాలిటీలోని సిద్దారం రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృషిబైపాస్ రోడ్‌లోని శాంతినికేతన్ స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న కోదాడకు చెందిన ఆత్మకూరి ప్రసాద్ (38)స్థానిక జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. కాగా కల్టివేటర్ ట్రాక్టర్ సత్తుపల్లి వైపు నుంచి రాజీవ్‌కాలనీ వెళ్తుండగా, అదే సమయంలో ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న ప్రసాద్‌లు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

పాల్వంచ, మే 23: కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన ఎల్లావుల వెంకటేశ్వర్లు(34) స్థానికంగా కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆ బాధను తాళలేక మద్యానికి సైతం బానిసయ్యాడు. బుధవారం రాత్రి కడపునొప్పి తీవ్రమవడంతో తనకు బతకాలని లేదని తాను చనిపోతానని కుటుంబ సభ్యులకు చెప్పాడు. కానీ కుటుంబ సభ్యులు అతని మాటలను అంతగా పట్టించుకోలేదు. కడుపునొప్పి వచ్చిన ప్రతి సందర్భంలో అలానే చెబుతాడని భావించారు. ఇంట్లోని అందరూ నిద్రించిన తరువాత ఇంటి ముందున్న రేకుల షెడ్డులో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అర్ధరాత్రి సమయంలో మృతుడి కుమారుడు సంపత్ అతడిని గమనించి కుటుంబ సభ్యులను నిద్రలేపాడు. కుటుంబ సభ్యులు అతడిని వెంటనే పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడు వెంకటేశ్వర్లు తమ్ముడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆర్టిజన్ కార్మికుడు...

పాల్వంచ, మే 23: ఆర్థిక ఇబ్బందులతో కేటీపీఎస్ ఆర్టిజన్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కేటీపీఎస్ కర్మాగారంలో ఆర్టిజన్‌గా ఇండ్ల రవి (38) విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల భార్య మూడో బిడ్డను ప్రసవించేందుకు కోదాడలోని తన పుట్టింటికి నాలుగు నెలల క్రితం వెళ్లింది. అప్పటి నుంచి పాల్వంచ మునిసిపాలిటీ పరిధిలోని రాంనగర్‌లో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్న అతడు తనకు వచ్చే జీతంలో అధికశాతం భార్యకు పంపించడానికి వినియోగిస్తుండటంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం తన గదిలో పురుగులమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన అతని రూంమేట్ హుటాహుటిన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య రమ్యకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ అడిషనల్ ఎస్ఐ రాఘవయ్య తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే23: మద్యానికి బానిసై వ్యక్తి పురుగు ల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన లక్ష్మీదేవిపల్లి మండ లంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం పట్టణంలోని బూడిదగడ్డ ప్రాంతానికి చెందిన గోరంట్ల నారాయణరాజు (50) వెల్డింగ్ షాపులో పని చేస్తూ తల్లితో పాటు జీవిస్తున్నాడు. అతిగా మద్యం సేవించొద్దు అని తల్లి మందలించడంతో బుధవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి పోయాడు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ పరిధిలోని హేమచంద్రాపురం రైల్వే ట్రాక్ పక్కన పురుగుల మందు సేవించి మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి కొత్తగూడెం డివిజన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లికి నిరాకరించిన వ్యక్తిపై కేసు నమోదు

ఖమ్మం రూరల్, మే 23: ప్రేమించాను, పెండ్లి చేసుకుంటానని చెప్పి ఓ యువతిని అదే గ్రామానికి చెందిన యువకుడు మోసం చేసిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బొప్పి సంజయ్ అనే యువకుడు, ఆదే గ్రామానికి చెందిన యువతిని ప్రే మించి పెండ్లి చేసుకుంటానని చెప్పి లోబర్చుకున్నాడు. ఈ క్రమంలో యువతి అతడిని పెండ్లి చేసుకోమ్మని ఒత్తిడి చేయగా, అతడు పెండ్లికి నిరాకరించాడు. దీంతో మనస్తాపం చెందిన యువతి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. వెంటనే తల్లిదండ్రులు ఆ యువతిని ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం యువతి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మే రకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల పక్షాన పోరాడేది బీజేపీనే

- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఒక పక్షమే
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలి
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

ఖమ్మం, మే 23(ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్రంలో ప్రజల పక్షాన పోరాడేది బీజేపీనేనని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఖమ్మంలో పర్యటించిన కిషన్‌రెడ్డి స్థానిక శ్రీశ్రీ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనన్నారు. బీజేపీ మాత్రమే నిజమైన ప్రతిపక్ష పాత్ర పోసించబోతోందన్నారు. పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయడం వల్ల ఉపయోగం లేదన్నారు. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి ఒక్కరే అధికార పక్షాన్ని నిలదీసే శక్తి ఉందన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రి, మంత్రులను కలిసి ఫోటోలు దిగుతున్నారని లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత వారంతా కాంగ్రెస్‌లో చేరడం ఖాయమన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ముఖ్యులు కూడా ఆ పార్టీలో ఉండే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండు ఒకటేనన్నారు. గతంలో కూడా కాంగ్రెస్ నుంచి 19మంది ఎమ్మెల్యేలు గెలిస్తే 12మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బీఆర్ఎస్‌లో చేరారని గుర్తు చేశారు. ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరబోతున్నారని, ఈ రెండు పార్టీలకు ఇచ్చిపుచ్చుకునే ఆనవాయితీ ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నిజమైన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన అసెంబ్లీలో కొట్లాడేది బీజేపీ మాత్రమేనన్నారు. గతంలో శాసనమండలిలో కూడా బీజేపీ ఎమ్మెల్సీగా ఉన్న రామచంద్రరావే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలదీశారని, ఈసారి పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపిస్తే ప్రజల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేస్తారన్నారు. గతంలో గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సగంలోనే పదవికి రాజీనామా చేసి పట్టబద్రులను మోసం చేశాడన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండోస్థానం కోసం పోటీపడుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక గ్యారంటీలు, హామీలతో మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. వరికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్నధాన్యానికే ఇస్తామని చెప్పడం ఏంటన్నారు. రాష్ట్రంలో పండే ధాన్యా న్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రవాణ, కమీషన్ ఖర్చులు కూడా కేంద్రమే ఇస్తుందని, రాష్ట్రప్రభుత్వం ఇచ్చేది ఏమీ లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న రూ.500బోనస్ అన్ని రకాల ధాన్యానికి ఇవ్వాలన్నారు. లేదంటే రైతులను మోసం చేసినట్టేనన్నారు. రూ.2లక్షల రుణమాఫీ చేయకుండా ఇప్పుడు కార్పొరేషన్ పెడతాం, అప్పు తెస్తామని చెబుతున్నారన్నారు. బీజేపీ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి మూడోసారి అధికారం వచ్చేలా ఓట్లు వేశారన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, గంటేల విద్యాసాగర్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి రామనాధం, నంబూరి రామలింగేశ్వరావు, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, దేవకి వాసుదేవరావు పాల్గొన్నారు.

నాలుగు నెలలకే కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తం

- మాజీఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు రఘునందన్‌రావు


సమావేశంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునందన్

కొత్తగూడెం, మే 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగు నెలలకే కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా మారిందని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు రఘునందన్ రావు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తికమకపెడతూ వారి మనోభావాలతో ఆడుకుంటున్నారన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విజయం కోసం గురువారం భద్రాద్రి జిల్లా కొత్తగూడెం కేంద్రమైన కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయసమ్మేళనంలో రఘునందన్‌రావు పాల్గొని మాట్లాడుతూ అవినీతిపరులు పూటకో పార్టీలు మార్చే వారిని చట్టసభల్లోకి పంపించవద్దని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే పార్టీలో జోకుడు తప్ప ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసిన తీన్మార్ మల్లన్న జర్నలిస్టుగా ఉంటూ ప్రజలపక్షాన ప్రతిపక్షపాత్ర పోషించాలే తప్ప అధికార పార్టీ పంచన చేరి తానా అంటే తందానా అనకూడదన్నారు. జూన్ 10 తర్వాత బీఆర్ఎస్ పార్టీలో పెను మార్పులు జరిగి చివరకు ఆ పార్టీలో ముగ్గురు మాత్రమే మిగులుతారో లేక చివరకు అయ్యా కొడుకులు మాత్రమే ఉంటారేమోనని ఎద్దేవా చేశారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మూడు మంత్రి పదవులు ఇచ్చినా జిల్లా అభివృద్ధికి నిధులు రాబట్టుకోలేకపోతున్నారన్నారు. గత ప్రభుత్వాలు అనేకసార్లు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, పట్టాలు, డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చాయని, అయినా ఇప్పటి వరకు జర్నలిస్టులకు ఇళ్లు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ. రంగాకిరణ్, జిల్లా నాయకులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సీతారామరాజు, శ్రీనివాస రెడ్డి, సీతారామరాజు, పసుమర్తి సతీష్ గుగులోత్ రాంచందర్‌నాయక్, రవి,కుంజా ధర్మా, శీనివాస్, జీవీకే. మనోహర్, రవీందర్, నరేంద్రబాబు, శ్రీధర్, వంశీ కృష్ణపాల్గొన్నారు.

వడివడిగా సీతారామ లింక్ కెనాల్ నిర్మాణం

(5వ పేజీ తరువాయి)

నత్తనడకన సాగాయి. ప్రభుత్వం మారిన తర్వాత మంత్రి తుమ్మల చొరవ తీసుకుని ఈ ఏడాదిలో సీతారామ ద్వారా కొంత భూ మికైనా సాగు నీరందించాలన్న పట్టుదలతో రూ.100 కోట్లతో లింక్‌కెనాల్ మంజూరు చేయించారు. జూలూరుపాడు మండలం వినోబానగర్ నుంచి వైరాలోని సాగర్‌కెనాల్ వరకు 8.66కి.మీ. కాలువ మంజూరు చేయించారు 6 మీటర్ల వెడల్పున నిర్మిస్తున్న ఈ కాలువ ద్వారా వైరా రిజర్వాయర్‌ను గోదావరి జలాలను నింపే సౌలభ్యం కలగనుంది. అలాగే లంకసాగర్ ప్రాజెక్టుకు కూడా నీరు చేరనుంది. కృష్ణాలో నీటి కొరత ఏర్పడితే వైరా, లంకాసాగర్ ఆయకట్టులో సాగు కష్టంగా మారుతుంది. అయితే కృష్ణా జలాలతో సంబంధం లేకుండా వైరా లింక్ కెనాల్ ద్వారా సీతారామా నుంచి గోదావరి జలాలతో సాగుకు నీరందించే అ వకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే వైరాలింక్ కెనాల్ పనులను మంత్రి తుమ్మల ప్రతిష్టాత్మకం గా తీసుకుని ఇప్పటికే రెండుసార్లు పర్యవేక్షించా రు. ఆగస్టు నాటికి పనులు పూర్తిచేయించి సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు అందిచాలనే పట్టుదలతో ఉ న్నారు. అందులో భాగంగానే గురువారం మంత్రి తుమ్మల ఏన్కూరు లింక్‌కెనాల్ పనులను పర్యవేక్షించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులతో సమీక్ష చేయలేదు. అనంతరం భగవాన్‌నాయక్‌తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు శోభన్‌నాయక్ స్వగృహంలో తేనీటి విందు స్వీకరించారు.

లింక్ కెనాల్ పనులు వేగవంతం

సీతారామ ఏన్కూరు లింక్ కెనాల్ పనులను వేగవంతం చేయాలని, నెల రోజులలో ప్రధాన పనులన్నీ పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఏన్కూరు సమీపంలో జరుగుతున్న ప్రాజెక్టు పనులను ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగియగానే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన జరిగే విధంగా చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. సీతారామ ప్రధాన కాలువ దాదాపుగా పూర్తయిందని, ఈ లింక్ కెనాల్ ద్వారా ఈ ఏడాది లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు. నాగార్జునసాగర్ ఆయకట్టుతో పాటు వైరా, కల్లూరు పెద్దచెరువు, సత్తుపల్లి లంకసాగర్ ప్రాజెక్టులను నింపడంతో పాటు ఈ ప్రాంతంలోని చెరువులను నింపి, లిఫ్టు ఇరిగేషన్లు పూర్తిస్థాయి లో పనిచేసేలా కృషిచేస్తానన్నారు. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే తన జీవితాశయమని తుమ్మల పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రాజెక్టు పనులు పూర్తి చేసి సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

భూములు కోల్పోయిన రైతులకు అండగా ఉంటా

త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి సీతారామ కెనాల్‌లో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం భూములు కోల్పోయిన రైతులు ఎకరాకు రూ.40లక్షల నష్ట పరిహారం చెల్లించాలని మంత్రికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, తుమ్మల ముఖ్య అనుచరుడు గుత్తా వెంకటేశ్వరరావు, ఏన్కూర్ సొసైటీ ఛైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

యాంత్రిక శక్తిని వినియోగించాలి

- సింగరేణి డైరెక్టర్ పా, పీఅండ్‌పీ వెంకటేశ్వరరెడ్డి

మణుగూరుటౌన్, మే 23: సింగరేణి కాలరస్ కంపెనీ మణుగూరు ఏరియాకు నిర్ధేశించిన లక్ష్యాలను సాధించేందుకు శ్రామిక శక్తితోపాటు యాంత్రిక శక్తిని సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి డైరెక్టర్ పా, ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. గురువారం ఆయన ఏరియాలోని మణుగూరు ఓసీ, పీకేఓసీ-4 గనులను ఏరియా జీఎం దుర్గం రామచందర్‌తో, అధికారులతో కలిసి సందర్శించారు. గనుల్లో జరుగుతున్న ఉత్పత్తి, ఉత్పాదకతలను పరిశీలించారు. లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళిక బద్ధంగా బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికి తీయడం పనులను నిర్వహించాలన్నారు. బొగ్గు ఉత్పత్తికి శ్రామిక శక్తిని ఎంత మేరకు ఉపయోగిస్తామో, అంతకు మించి యంత్రాల పని గంటలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది వార్షిక లక్ష్యం 126.5 లక్షల టన్నులను రక్షణ సూత్రాలను పాటిస్తూ అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగుల సమష్టి కృషితో ముందుకు సాగాలన్నారు. వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలగకుండా గనుల్లో వరద నీటిని తొలగించేందుకు కావాల్సిన విద్యుత్ పంపు మోటార్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు శ్యామ్ సుందర్, నర్సిరెడ్డి, లక్ష్మీపతి గౌడ్, వీరభద్రుడు, సురేష్, రాజేశ్వరరావు, అబ్దుల్ షబ్బీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలీసెట్ ఎంట్రన్స్

- ఖమ్మం జిల్లాలో ఐదు.. భద్రాద్రిలో 10 పరీక్ష కేంద్రాల ఏర్పాటు


ఖమ్మం ఖానాపురంహవేలి/చుంచుపల్లి, మే 23: రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాలిటెక్నిక్లలోని మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్-ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటుగా, వ్యవసాయ డిప్లొమా, వెటర్నరీ డిప్లొమా ప్రవేశం కోసం జరిగే పాలీసెట్-2024ను శుక్రవారం ఉదయం. 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఖమ్మం జిల్లా కో-ఆర్డినేటర్ డా.జాకిరాల్లా తెలిపారు. ఈ పరీక్షకు ఖమ్మం నగరంలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేయగా 2,591 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యార్థులు ఉదయం 10గంటల లోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులు తమవెంట హెచ్‌బి పెన్సిల్, ఎరేసర్, షార్పనర్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ తప్పక తీసుకొని రావాల్సి ఉంటుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థిని పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరు. హాల్ టికెట్ మీద ఫోటో ప్రింట్ కానివారు ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఐ.డి ప్రూఫ్ (ఆధార్ కార్డు) తెచ్చుకోవాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రంలోని సెల్‌ఫోన్ కానీ, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులను అనుమతించరు.

భద్రాద్రి జిల్లాలో 2,878మంది విద్యార్థులు

పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాలిసెట్ జిల్లా కన్వీనర్, రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగమునినాయక్ తెలిపారు. ఈ పరీక్ష కోసం జిల్లాలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 2,878 మంది విద్యార్థులకు హాల్ టిక్కెట్లు పొందినట్లు వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో నర్సింగ్ విద్యార్థిని మృతి

- భద్రాచలంలోని కళాశాల వసతిగృహంలో తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితికి
- భద్రాద్రి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
- కారణాలు తెలియాలని కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన
- పరిస్థితిని సమీక్షించిన భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్


వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న కారుణ్య

భద్రాచలం, మే 23: భద్రాచలంలోని కూనవరం రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గురువారం తెల్లవారుజామున కళాశాల వసతిగృహం ఆవరణలో అనుమానాస్పద స్థితిలో తీవ్రగాయాలతో అచేతన స్థితిలో పడి ఉన్న విద్యార్థినిని కళాశాల యాజమాన్యం భద్రాద్రి ఏరియా వైద్యశాలకు తరలించగా అక్కడ వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది.

ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం సిద్దిక్‌నగర్ గ్రామానికి చెందిన పగిడిపల్లి కారుణ్య(18) బీఎస్సీ నర్సింగ్ చదువుకునేందుకు నాలుగు నెలల క్రితం భద్రాచలంలోని ఓ ప్రైవేటు కళాశాలలో చేరింది. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున కారుణ్య కళాశాల వసతిగృహం ఆవరణలో తీవ్ర రక్తస్రావంతో అచేనత స్థితిలో పడి ఉంది. ఈ విషయం తోటి విద్యార్థుల ద్వారా కళాశాల యాజమాన్యానికి తెలియడంతో వారు వెంటనే ఆమెను భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించి రాత్రి 9గంటల సమయంలో మృతి చెందింది. తమ కుమార్తెకు తీవ్రగాయాలైన విషయం తెలుసుకొని ఆసుపత్రికి చేరుకున్న కారుణ్య తల్లి సునీత, ఇతర కుటుంబ సభ్యులు ఈ ఘటనకు కారణాలు తమకు వెంటనే తెలియాలని, ఘటనపై అనుమానాలున్నాయని భద్రాచలం ఏరియా వైద్యశాల వద్ద ఆందోళనకు దిగారు. దీంతో భద్రాచలం ఏఎస్పీ పరితోష్‌పంకజ్ అక్కడికి చేరుకోవడంతో తమకు న్యాయం చేయాలని కారుణ్య బంధువులు కోరారు. దాంతో ఏఎస్పీ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా అంతకు ముందు నర్సింగ్ విద్యార్థిని గాయపడిన విషయం తెలిసిన వెంటనే పట్టణ ఎస్ఐ విజయలక్ష్మి సంఘటన స్థలానికి వెళ్లి పూర్తి వివరాలను సేకరించారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భద్రాచలం సీఐ సంజీవరావు తెలిపారు.

ప్రైవేట్ ఉపాధ్యాయురాలి ఖాతాలో నగదు మాయం

● వెంగన్నపాలెంలో ఆలస్యంగా వెలుగులోకి

జూలూరుపాడు, మే 23: ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న మహిళ ఉపాధ్యాయురాలు ఖాతాలో నుంచి నగదు మాయమైన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. మండలంలోని వెంగన్నపాలెంలో ఓ ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ఈ నెల 21వ తేదీన మెడిసిన్స్ తెప్పించుకొనేందుకు కొరియర్ సర్వీస్‌ను ఫోను ద్వారా సంప్రదించింది. గతంలో కూడా మహిళ ఉపాధ్యాయురాలు కొరియర్ సర్వీస్ ద్వారా మందులను తెప్పించుకుంది. ఈ క్రమంలోనే మరోసారి మందులు కోసం కొరియర్ సర్వీస్‌కు ఫోను చేసింది. దీంతో వారు వివరాలను తెలిజేయాలని కోరగా, సదరు ఉపాధ్యాయురాలు తన పేరు, బ్యాంకు వివరాలను వారికి తెలియజేసింది. దీంతో కొద్దిసేపటికే ఆమె ఖాతాలో నుంచి రూ. 69000లు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో ఈ నెల 22వ తేదీన బ్యాంక్ వద్దకు వెళ్లి ఉద్యోగిని తెలుసుకోగా, ఖాతాలో నుంచి ఈ నెల 21వ తేదీన రూ.40,000లు ఒకసారి, అదే రోజు 29,000లు నగదు మరోసారి డ్రా చేసినట్లు బ్యాంక్ సిబ్బంది తెలిపారు. దీంతో బాధితురాలు జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ జీవన్‌రాజు విచారణ నిర్వహిస్తున్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

● 400 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

బూర్గంపాడు, మే 23: బూర్గంపాడు మండల పరిధిలోని దోమలవాగు, గోదావరి పరివాహక ప్రాంతాల్లో గుడుంబా స్థావరాలపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు 400లీటర్ల బెల్లం పానకం, గుడుంబా తయారీకి ఉపయోగించే సామాగ్రి లభ్యమైనట్లు ఎస్ఐ సీతారామరాజు తెలిపారు. పానకం డ్రమ్ములను ధ్వంసం చేశారు. దాడుల్లో డీటీఎఫ్ ప్రత్యేక అధికారి గౌతమ్, సిబ్బంది వీరబాబు, బాబు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం 24 మే 2024



నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



కరకగూడెం, మే 23: మండలంలోని రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కరకగూడెం ఎస్ఐ రాజేందర్ హెచ్చరించారు. గురువారం మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపుల యజమానులతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. రైతులకు నాణ్యత లేని విత్తనాలు విక్రయించవద్దని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. రైతులకు విక్రయించే విత్తనాలకు సంబంధించిన రశీదు రైతులకు తప్పక ఇవ్వాలని సూచించారు. మండలంలో ఎవరైనా గుర్తింపు లేకుండా అక్రమంగా నకిలీ విత్తనాలు విక్రయిస్తే సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్ సంఘం నాయకులు చిట్టి వెంకటేశ్వర్లు, బైరిశెట్టి సూర్యం, యమసాని సోమయ్య, నలుగు భిక్షపతి, తిప్పని సాయి, అత్తె నరేష్ పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనాలకు గ్రహణం

కనిపించని ఆహ్లాదం....అసాంఘిక కార్యకలాపాలకు నిలయం

నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం.. ప్రజాధనం వృథా

జూలూరుపాడు, మే 23: గ్రామాలలో పచ్చదనాన్ని పెంపొందించి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతూ, కాలుష్యాన్ని అరికట్టాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో పల్లెపక్రృతి వనాలను ఏర్పాటు చేసింది. పంచాయతీ నిధులతో ఆర్భాటంగా పల్లెపక్రృతి వనాల పేరుతో గ్రామా



గుండెపూడిలోని పల్లె ప్రకృతి వనంలో ఎదగని మొక్కలు

సమీపాలలో ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ పాఠశాలల ఆవరణలలో వీటిని ఏర్పాటు చేశారు. వేలాది మొక్కలను నాటారు. వాటికి సరిగ్గా నీరు అందించకపోవటంతో వీటిని ఏర్పాటు చేసి ఏళ్ల గడుస్తున్న అవి ఎండిపోయి దర్శమిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవటంతో వీటి లక్ష్యం నిరుపయోగంగా మారింది. ఈ వనాలలో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌లు నిరుపయోగంగా మారాయి. మండలంలోని 24 పంచాయతీల పరిధిలో పల్లెపక్రృతి వనాలను నిర్మించినారు. పాపకొల్లు, గుండ్లరేవు పంచాయతీల పల్లెపక్రృతి వనాల మినహా మిగిలిన పంచాయతీలలో నిర్మించిన పల్లెపక్రృతి వనాలలో నాటిన మొక్కలు నిరాదారణకు గురై ఎండిపోయాయి. వాటి స్థానంలో పిచ్చి మొక్కలు, ముళ్లచెట్లు ఏపుగా పెరిగాయి. కొన్ని వనాలు పిచ్చి మొక్కలతో చిట్టి అడువులను తలపిస్తున్నాయి. వీటిని తొలగించే నాథుడే కరువయ్యాడు. వీటి నిర్వహణ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని ప్రజలు అంటున్నారు. లక్షలాది రూపాయల నిధులతో పల్లెప్రకృతి వనాలను నిర్మించినప్పటికి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచకపోవటంతో ఆ నిధులు బూడిదలో పోసిన పన్నీరుల మారయని ప్రజలు అంటున్నారు. ప్రజలకు పచ్చదనాన్ని పంచాల్సిన పల్లెపక్రృతి వనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. రాత్రి వేళల్లో పలువురు పల్లెపక్రృతి వనాల్లో మద్యాన్ని సేవిస్తుండటంతో సీసాలు దర్శమిస్తున్నాయి. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన వనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారడం పట్ల ప్రజలు ఆక్షేపణ వ్యక్తం



వెంగన్నపాలెంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో చెత్త ఏపుగా పెరిగిన దృశ్యం

చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేమి వల్ల ఇలా జరిగిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పంచాయతీ సిబ్బంది దృష్టి సారించి పల్లెపక్రృతి వనం పథకం లక్ష్యం నేరవేరేలా చర్యలు తీసుకోవాలని, వాకింగ్ ట్రాక్‌లను నడవటానికి అనుకూలంగా మార్చాలని, పిచ్చి మొక్కలను తొలగించి పచ్చదనాన్ని పెంపొందించేలా కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరగా ధాన్యం కొనుగోల్లు పూర్తిచేయాలి

కలెక్టర్ ప్రియాంక అల... కొనుగోలు కేంద్రం సందర్శన



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల

సుజాతనగర్, మే 23: సుజాతనగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల గురువారం తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ ధాన్యాన్ని పరిశీలించి తేమ శాతం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. తదుపరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం నిర్ణీత తేమ శాతం (17 శాతం) వచ్చే వరకు ఆరబెట్టుకోవాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రంలో గల ధాన్యాన్ని అకాల వర్షాలకు తడవకుండా టార్పాలిన్ పట్టాలతో కప్పి ఉంచాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో సంబంధిత మిల్లులకు తరలించాలని కొనుగోలు కేంద్ర నిర్వహకులకు సూచించారు. రానున్న రోజుల్లో వర్షాలు అధికంగా పడే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, అదే విధంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే ట్యాగింగ్ చేసి రైస్ మిల్లులకు సరఫరా చేయాలని అధికారులని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌డీవో విద్యాచందన, పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ త్రినాధ్ బాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి రుక్మిణి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబురావు, జిల్లా సహకార అధికారి ఖుర్షీద్, తహశీల్దార్ శిరీష, ఏవో నర్మద తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల తనిఖీ

సుజాతనగర్ మండలంలోని వేపలగడ్డ ఎంపీపీఎస్ పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో చేసిన పనులను పరిశీలించారు. ఎలక్ట్రిక్ పనుల్లో భాగంగా విద్యుత్ తీగలు బయటకు వేలాడటం గమనించి, పనులు తాత్కాలికంగా చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరిగి పాఠశాల తనిఖీకి వస్తానని, పనులు అన్నీ నాణ్యత పాటిస్తూ శాశ్వత ప్రాతిపదికన పనులు పూర్తికావాలని అధికారులని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మంచినీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, లైట్లు అన్ని సౌకర్యాలు నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులు తిరిగి పాఠశాల ప్రారంభం అయి వచ్చేనాటికి అన్ని వసతులు కల్పించాలని, అన్ని హంగులతో నూతన విద్యా సంవత్సరం ఆరంభానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చే సమయానికి అన్ని హంగులతో పాఠశాలలను తీర్చిదిద్దాలని అన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని, అలసత్వం వీడాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శిరీష, కొత్తగూడెం తహశీల్దార్ పుల్లయ్య, ఎంపీడీవో టి.వెంకటలక్ష్మి, పీఆర్ ఏఈ శివలాల్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల పక్షాన ప్రశ్నించే గొంతుక మల్లన్న



ప్రచారం నిర్వహిస్తున్న కొత్వాల

పాల్వంచ, మే 23: నిరుద్యోగుల పక్షాన ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న అని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్రపక్షాలు బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ శ్రేణులు గురువారం పాల్వంచ మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని జగన్నాథపురం, నాగారం కాలనీ, రంగాపురం తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ కరపత్రాలను పంచి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడారు.

కాంగ్రెస్ నిర్ణయాలతో ప్రజల అవస్థలు

దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్

లక్ష్మీదేవిపల్లి, మే 23: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గందరగోళ నిర్ణయాలు తీసుకుంటోందని, వారు చేపట్టే ఏ కార్యక్రమంపై కూడ సరైన అవగాహణ, ప్రణాళిక లేదని, ప్రజలు వారి తడబాటును గమనించాలని దుబ్బా మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు రఘునందన్ అన్నారు. గురువారం కొత్తగూడెంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా ప్రజలకు ఒరిగిందేమి లేదని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఒక్క విశ్వవిద్యాలయాన్నైన తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. వడ్లకొనుగోలు కేంద్రాల వద్ద తడిచిన వడ్లు, దొడ్డు వడ్లు అంటూ తరుగు పేరిట రైతులు మోసం చేయవద్దని అన్నారు. జిల్లాలో వడ్లసాగుపై మంత్రులు శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. అధికారంలోకి రాకముందు క్వింటా వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కేవలం సన్నవడ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని అనడం రైతులపట్ల వారికి ఉన్న గౌరవం ఏమిటో



సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్

అర్థమవుతుందన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్, జిల్లా నాయకులు ప్రభాకర్, నాగేశ్వరరావు, రాయుడు నాగేశ్వరరావు, సీతారామరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట, మే 23: వైశాఖపౌర్ణమి సందర్భంగా నాగుపల్లిలో లక్ష్మీనారాయణస్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు ఆరాధన, సేవాకాలం, బాలబోగనివేదన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కంకణధారణ చేసారు. ఈ కల్యాణ మహోత్సవానికి నాగుపల్లి పరిసర ప్రాంత గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావులు కల్యాణ కార్యక్రమములో పాల్గొని పూజలు చేసారు. కల్యాణాన్ని అధిక సంఖ్యలో భక్తులు వీక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసారు.

వైభవంగా నృసింహస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లపల్లి, మే 23: ఆళ్లపల్లి మండల పరిధిలోని ఉడుముల గట్టుపై శ్రీ లక్ష్మి నర్సింహస్వామి కళ్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు చింతకాలయ కృష్ణ, లక్ష్మణచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించగా, భక్తులు కళ్యాణాన్ని తిలకించేందకు పెద్ద ఎత్తును తరలివచ్చారు. కమిటి ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు పులిహోర, నీటి సదుపాయం ఏర్పాటు చేశారు. ప్రజలు అధిక సంఖ్యలో కల్యాణం వీక్షించారు.

రైతును కాపాడుకుంటేనే సమాజం క్షేమం: ఏడీఏ

చంద్రుగొండ, మే 23: అన్నం పెట్టే రైతును కాపాడుకుంటేనే సమాజం క్షేమంగా ఉంటుందని, నకిలీలతో రైతులను కుదేలు చేయవద్దని అశ్వారావుపేట డివిజన్ వ్యవసాయశాఖ అధికారి అఫ్జల్ బేగం అన్నారు. గురువారం చంద్రుగొండ రైతు వేదికలో డివిజన్ పరిధిలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లోని విత్తన వ్యాపారులతో ఏడీఏ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని తెలిపారు. డీలర్లు నకిలీల జోలికి పోవద్దని, అదేవిధంగా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న దళారీల సమాచారం అధికారులకు తెలపాల్సిన బాధ్యత డీలర్లపై ఉందన్నారు. రైతులు సైతం విత్తనాలు కొనే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, గుర్తింపు ఉన్న డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని సూచించారు. వ్యాపారులు తమ దుకాణాల వద్ద వివరాలతో కూడిన పట్టికను ఏర్పాటు చేసి అందులో వ్యవసాయ అధికారుల ఫోన్ నెంబర్లను ఉంచాలని ఆదేశించారు. రైతులు విత్తనాలు కొనే సమయంలోనే విత్తే విధానంపై రైతులకు అవగాహన కలిప్పించాలని కోరారు. పంట దిగుబడి వచ్చేవరకు విత్తన వ్యాపారుల బాధ్యత ఉంటుందని తెలిపారు. ఈ సమావేశం



మాట్లాడుతున్న ఏడీఏ అఫ్జల్ బేగం

లో స్థానిక ఎస్ఐ మాచినేని రవి మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మినా, దళారి పాత్ర పోషించినా పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయటం జరుగుతుందని తెలిపారు. విత్తనాల నాణ్యతలో లోపాలు ఉంటే మాకు సంబంధంలేదని కంపెనీదే బాధ్యత అని తప్పించుకునే ప్రయత్నం కుదరదన్నారు. రైతులు ఇచ్చే ఫిర్యాదులను సైతం పరిశీలించి చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వృద్ధాశ్రమంలో మెజిస్ట్రేట్ అన్నదానం

మణుగూరుటౌన్, మే 23: మణుగూరు ప్రథమశ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కె.సూరిరెడ్డి ఆరిఫా అండ్ రోష్నీ వృద్ధాశ్రమంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మెజిస్ట్రేట్ కుమారుడు రుత్విక్ నారాయణరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ పేర్కొన్నారు.

విస్తృతంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఇల్లెందు, టౌన్ 23: ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారం గురువారం ఇల్లెందులో విస్తృతంగా నిర్వహించారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. మాజీ ఎమ్మెల్యే బాణోత్ హరిప్రియ, జిల్లా గ్రంధాలయ సంస్థ మా జీ చైర్మన్ దిండిగల రాజేందర్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రచారం నిర్వహించారు.

ట్రాక్టర్ బోల్తా.. తప్పిన పెను ప్రమాదం

గుండాల, మే 23: తునికాకు సేకరణ కోసం అడవికి వెళ్లిన ఓ ట్రాక్టర్ బోల్తా కొట్టడంతో ఇద్దరు కార్మికులకు గాయాలైన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. మండలంలో గత పదిహేను రోజులుగా తునికాకు సేకరణ జరుగుతోంది. కాగా కార్మికులు ఆసక్తిగా లేకపోవడంతో అడవిలోకి వెళ్లేందుకు కాంట్రాక్టర్ వాహన సదుపాయం కోసం డీజిల్ ఖర్చులు ఇస్తుండగా మిగతా ఖర్చులు కార్మికులు సొంతంగా భరిస్తున్నారు. ఈ క్రమంలోనే చీమలగూడెం గ్రామానికి చెందిన 20మంది కూలీలు ట్రాక్టర్‌పై శంభునిగూడెం అడవుల్లోకి వెళ్లారు. ఆకు సేకరణ అనంతరం తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ పల్టీ పడింది. ఈ సంఘటనలో పాయం లక్ష్మీ, కల్తి యశోదకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతావారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ట్రాక్టర్ ట్రాలీ మెల్లగా పడటంతో పెను ప్రమాదం తప్పింది. అడవిలో ఈ సంఘటన జరగడంతో సమాచారం అందుకున్న ఎస్సై రాజశేఖర్ రాత్రి సమయంలో సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. .

తుమ్మలను కలిసిన నాయకులు

జూలూరుపాడు, మే 23: వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును జూలూరుపాడు మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం ఏన్కూరులో కలిశారు. సీతారామ పనులను పరిశీలించేందుకు ఏన్కూరు మండలానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రావడంతో కాంగ్రెస్ జిల్లా నాయకులు, సొసైటీ చైర్మన్ లేళ్ళ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మంత్రిని కలిసి మండల సమస్యలను నివేదించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. పట్టభద్రుల ఇళ్ళకు వెళ్ళి ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు, సొసైటీ చైర్మన్ వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మంగీలాల్, ఎంపీటీసీ మధుసూదన్‌రావు, నాయకులు వేల్పుల నరసింహారావు, సాయిల కృష్ణయ్య, య



మంత్రి తుమ్మలతో కాంగ్రెస్ నాయకులు

ల్లంకి చిన్ననాగేశ్వరరావు, అల్లాడి నరసింహరావు, నవీన్ రాథోడ్, నాగరాజు పణితి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను గెలిపించండి

దమ్మపేట, మే 23: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఓటు గెలిపించాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. పట్వారిగూడెం, అంకంపాలెం, కొడిసెలగూడెం గ్రామాలలో పట్టభద్రుల ఎన్నికల ఇంటింటి ప్రచారాని ఎమ్మెల్యే నిర్వహించారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరిస్తూ మల్లన్నకు ఓటు వేసి అధిక మెజారిటితో గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అచ్యుతరావు, నాగేశ్వరరావు, చిట్టినాయన, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, అబ్దుల్ రహీం, ప్రసాదు, ప్రసాదరావు, భాస్కరరావు, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వాసుపత్రిలో డెలివరీలను పెంచాలి

జిల్లా అదనపు వైద్యాధికారి భాస్కర్ నాయక్

అన్నపురెడ్డిపల్లి, మే 23: ప్రభుత్వాసుపత్రుల్లో డెలివరీ కేసులను పెంచాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు వైద్యాధికారి భాస్కర్ నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం యర్రగుంట ప్రభుత్వాసుపత్రిలో జరిగిన అమ్మకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా గర్భిణీ స్త్రీలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ప్రతి నెలా పీహెచ్‌సీలో డెలివరీ కేసులు పెంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. చిన్న పిల్లల టీకాలు వేసి టార్గెట్‌ను పూర్తి చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో పలు రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సలహాలు సూచనలు చేశారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆయన వెంట వైద్యాధికారి ప్రియాంక, సిబ్బంది ఉన్నారు.

పెన్షన్ ఆదాలత్‌లతో సమస్యల పరిష్కారం

సీఎంపీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ కనకమ్మ

ఇల్లెందుటౌన్, మే 23: సింగరేణి ఉద్యోగులకు, మాజీ ఉద్యోగుల పెన్షన్, సీఎంపీఎఫ్ సమస్యల పరిష్కారం కోసం పెన్షన్ ఆదాలత్ నిర్వహిస్తున్నట్లు సీఎంపీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.కనకమ్మ పేర్కొన్నారు. గురువారం ఇల్లెందు ఏరియా స్థానిక వైసీఓఏ క్లబ్‌లో పెన్షన్ ఆదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు నెలలకొకసారి పెన్షన్ ఆదాలత్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పెన్షన్, సీఎంపీఎఫ్ సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వాటిని సకాలంలో పరిష్కారం చేస్తామని వెల్లడించారు. ఉద్యోగులు, మాజీ ఉద్యోగులకు ఏమైన సమస్యలు ఉన్నట్లైతే నేరుగా తమను సంప్రదించవ్చని తెలిపారు. పెన్షన్ అదాలత్ సందర్భంగా ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు, తమ సమస్యలను అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికారులు మల్లారపు మల్లయ్య, పవన్‌కుమార్, మోహన్, మధుబాబు, పి.కృష్ణ, సుధాకర్, సాయి స్వరూప్, సీఎంపీఎఫ్ అధికారులు సులోచన, సీతారాం, గుర్తింపు సంఘం నాయకులు కె.సారయ్య, ప్రాతినిధ్య సంఘం నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

కరకగూడెం, మే 23: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధరణి, ప్రజావాణి, రికార్డులు పరిశీలించిన తహసీల్దార్, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా 27న జరగనున్న ఎమెల్సీ ఎన్నికలకు సంబంధించిన వివరాలను తహసీల్దార్ నాగ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ధరణి పోర్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు సమయపాలన పాటించాలని, సమస్యలపై వచ్చే ప్రజలకు, విద్యార్థులకు తక్షణమే పనులు పూర్తి చేయాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని, సమస్యలపై వచ్చే ప్రజలకు సరైన న్యాయం చేయాలని ఆయన వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగ ప్రసాద్, డీటీ సంధ్య, ఆర్ఐలు హుస్సేన్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణిలో పర్యావరణపై అవగాహన

ఇల్లెందుటౌన్, మే 23: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం కార్యాలయంలో గురువారం అధికారులు, ఉద్యోగులకు పర్యావరణపై అవగాహణ కల్పించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం ఆనంద్ మాట్లాడుతూ సింగరేణిలో పర్యావరణ పరరిక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. వాతావరణ మార్పులతో కలిసే వినాశకరమైన పర్యావసనాల నుంచి భూగ్రహాన్ని రక్షించేందుకు భారత్ నేతృత్వంలోఅంతర్జాతీయ కార్యచరణకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ ఉద్యమంను ఒక సామాజిక ఉద్య మంగా మార్చేవిధంగా ప్రధాన నరేంద్రమోదీ మిషన్‌లైఫ్ ప్రారంభిం చారని తెలిపారు. వాతావరణ మార్పులతో ప్రతి చోటు సమస్యలు ఎదురవుతున్నారని హిమాయాలు కరిగిపోతున్నాయని, నదులు ఎండి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం మల్లయ్య, ఏరియా ఇంజనీరు నర్సింహరావు, డీజీఎం పర్సనల్ మోహన్ రావు, డీజీఎం సర్వే బాలాజీనాయుడు పాల్గొన్నారు.

WALK - IN - INTERVIEW

ఆంధ్రజ్యోతి దినపత్రికలో పనిచేయుటకు నిరుద్యోగ యువకులకోసం ఈ క్రింది ఉద్యోగ అవకాశాలు కలవు. కాబట్టి అర్హత కలవారు ఇంటర్వ్యూలకు హాజరుకాగలరు.

ఆంధ్రజ్యోతి

అసిస్టెంట్ సర్క్యులేషన్ ఆఫీసర్ (ACO)

భద్రాచలం

డివిజన్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ (SR's)

సత్తుపల్లి, పాల్వంచ

అభ్యర్థి తన డివిజన్ పరిధిలోని ఏజెంట్లను, సేల్స్ టీమ్స్‌ను కో-ఆర్డినేషన్ చేస్తూ మంచి రిజల్ట్ వచ్చేవిధంగా పని చేయవలసి ఉంటుంది. అభ్యర్థి కనీస అర్హతఇంటర్‌మరియు సేల్స్ రంగంపై ఆసక్తి కలిగి ఉండవలెను. అర్హత, అనుభవాన్ని బట్టి వేతనం నిర్ణయించబడును. పై అర్హతలు గల అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకాగలరు

ఇంటర్వ్యూ తేది:
25-05-2024 ఉ॥ 10:00 నుండి మ॥ 2 గంటలు వరకు

ఇంటర్వ్యూ స్థలము : సర్క్యులేషన్ మేనేజర్
ఆంధ్రజ్యోతి కార్యాలయం.
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్స్ నెం: 112,
ఇండస్ట్రియల్ ఏరియా ఖానాపురం హవేలి,
శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి గుడి రోడ్డు, ఖమ్మం
సెల్: 9985411350

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

5 ఎకరాల మాగాణి అమ్మబడును

★ కోదాడ మండలం, నేషనల్ హైవేకి అతి దగ్గరలో, తొగర్రాయి సబ్‌స్టేషన్ నుండి కాపుగల్లు రోడ్డు నందు 5 ఎకరాల మాగాణి భూమి అమ్మబడును. దారి, నీటి సౌకర్యం కలదు. ఎకరం 42 లక్షలు సంప్ర॥ 9848480379
AJY_152580

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజ నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపులు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

స్వదేశాగమనము/ విదేశీయానం, | పుట్టిన రోజు | వివాహ వార్షికోత్సవం
షష్టిపూర్తి | లీగల్ నోటీసులు | శ్రద్ధాంజలి
పదవీవిరమణ | వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు

4 Lines Classifieds
Khammam + B-Kothagudem Dists
220/- Only
Extra Line 45/- only

ఖమ్మం : 9985401672

ఖమ్మం
9985406151
9985401698

కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347